ప్రజాశక్తి
విశాఖ
గురువారం
జనవరి 4,
2018



పావురాలు ఎగురవేస్తూ క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి గంటా

సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఆంధ్రవిశ్వవిద్యాలయం, రఘు ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అంతర్‌విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీలను బుధవారం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎయు వీసీ నాగేశ్వరరావు, జెఎన్‌టియు కాకినాడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వివిఎస్.కుమార్, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఐదు రాష్ట్రాల నుంచి 98 టీములు పాల్గొన్నాయి.

మెయిన్, టాబ్లాయిడ్‌లో..



పోలీసుల అదుపులో నిందితులు

పెద్దలపై చర్యలేవీ?

- సెటిల్‌మెంట్ బ్యాచ్‌ను వదిలేసిన పోలీసులు
- గిరిజన బాలికపై రేప్ కేసులో ముగ్గురు అరెస్టు
- అందరినీ అరెస్టు చేయాలని ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

అభం శుభం తెలియని గిరిజన మూగ బాలికపై అత్యాచారం చేసిన నిందుతుడ్ని పోలీసులు పట్టుకున్నా, బాలిక శీలానికి వెల కట్టి వారి మధ్య రాజీ కుదర్చడానికి రూ. 25వేలు తీసుకోవడమే కాకుండా ఈ కేసులో కీలక పాత్ర పోషించిన ఎస్ఇజెడ్‌లోని హెచ్‌బిఎల్ అధికారులను పోలీసులు అరెస్టులు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం కేసును నీరుగార్చాలనే ఉద్దేశంతోనే అక్కడ అధికారుల జోలికి పోలీసులు వెళ్లడం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

దువ్వాడ ఎస్ఈజెడ్‌లో మూగబాలికపై గత శనివారం అత్యాచారం చేసిన నిందితుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన డ్రైవర్ సిహెచ్ విశ్వనాథ్‌తోపాటు బస్ యజమాని ముప్పల అప్పలరాజు, సెక్యూరిటీ అధికారి ఎం.సూర్య ప్రకాశరావును మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అత్యాచారానికి సంబంధించిన సెటిల్మెంట్ మొత్తం హెచ్‌బిఎల్ కంపెనీ పరిపాలనా విభాగంలోనే జరిగింది. లక్ష రూపాయలకు ఒప్పందం కుదిర్చిన హెచ్‌బిఎల్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఆమె వద్ద నుంచి కమీషన్ రూపంలో రూ.25వేలు తీసుకుని న్యూ ఇయర్ పార్టీ చేసుకున్నారు. నిజానికి సెక్యూరిటీ అధికారి కంటే ఈ విషయంలో హెచ్‌బిఎల్ అధికారులదే ఎక్కువ పాత్ర అని తెలిసినా పోలీసులు వారిపై దృష్టి సారించలేదు. బాధితురాలు తమ్ముడు ఫిర్యాదు చేయడంతో సిపి యోగానంద్ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. అత్యాచారానికి పాల్పడిన బస్ డ్రైవర్‌ను ఎ1 ముద్దాయిగాను, సెక్యూరిటీ అధికారి ప్రకాశరావును ఎ2 గాను, బస్ యజమాని అప్పలరాజును ఎ3 గాను చేర్చుతూ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కానీ సెటిల్మెంట్‌లో కీలక పాత్ర పోషించిన మిగిలిన అధికారులను మాత్రం వదిలేయడం చర్చనీయాంశమైంది. బాధితురాలు గిరిజన తెగకు చెందినది కావడంతో కేసును ఎస్సీ ఎస్టీ సెల్ పోలీసు అధికారి ప్రవీణ్‌కుమార్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఆయన ఆధీనంలోనే తదుపరి విచారణ జరుగుతుంది. మూగ గిరిజన యువతి జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తికి కొమ్ముకాసిన వ్యక్తులందరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. ఒక బలహీన తెగకు చెందిన బాలిక అత్యాచారానికి గురైతే, ఎస్ఈజెడ్ అధికారులు ఆమెకు సహాయం చేయకుండా నిందుతునితో చేతులు కలిపి శీలానికి వెల కట్టడం పట్ల మహిళా సంఘాలు భగ్గుమంటున్నాయి. వెంటనే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

15ఏళ్ల బాలికతో వెట్టి చాకిరీ..

15 ఏళ్ల బాలికను ఆ కంపెనీ తోట పనికి పురమాయించిన కాంట్రాక్టర్ ఎవరు? లోనికి ప్రవేశించేందుకు అవసరమైన గుర్తింపు కార్డు కోసం ఆమె

మిగతా 4లో..



మెయిన్, టాబ్లాయిడ్‌లో

ధర్నాకు మద్దతు తెలుపుతూ మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

గిరిజన మూగ బాలికపై అత్యాచారం హేయం

దువ్వాడ సెజ్ గేటు వద్ద ప్రజా సంఘాల ఆందోళన

అట్టహాసంగా మేజర్ పోర్టు క్రీడలు

పేజీ 12లో..

గీతోపదేశం

పెద్దోళ్ల జోలికి వెళ్లందని పోలీసులకు ఆర్డరంట.. అందుకే మన అధికారుల వద్దకు రాలేదు గురూ..



పెద్దలపై చర్యలేవీ?

ఐదు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు

తొలిదశలో 754 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారయ్యాయి. రెండు దశల్లో ఈ పార్కుల ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమిని సిద్ధం చేయనుంది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) చేతిలోనున్న భూములతో పాటు ప్రభుత్వ భూములను ఈ పార్కుల ఏర్పాటుకు సిద్ధం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వ ఆలోచనలకు తగినట్లు ఎంఎస్ఎంఇ పార్కులను ఏ నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి జిల్లా పరిశ్రమల కేంద్రం పంపింది. తొలి దశలో నర్సీపట్నం, భీమిలి, పెందుర్తి, గాజువాక, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 754.73 ఎకరాల్లో పార్కులు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమిని పారిశ్రామికవేత్తలకు ఇవ్వడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తే పెట్టుబడులను ఆకర్షించడం సులువు అతుందన్న ఆలోచనలో ఉంది. సెజ్‌కు సేకరించిన భూముల్లో పూర్తిస్థాయిల్లో పరిశ్రమలు రాకపోవడంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా పెట్టుబడులను రాబెట్టుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

నర్సీపట్నం నియోజకవర్గంలోని మాకవరపాలెం మండలం రాచపల్లిలో 104.74 ఎకరాలు, భీమిలి నియోజకవర్గంలోని

మిగతా 4లో..



టెన్నిస్ ఆడుతున్న గీతం విద్యార్థిని

హెల్త్ వర్సిటీపై గీతం జట్టు విజయం

ప్రజాశక్తి - విశాఖపట్నం

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న దక్షిణాది రాష్ట్రాల సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ మహిళా టెన్నిస్ పోటీలలో రెండవ రోజైన బుధవారం ఆతిథ్య గీతం జట్టు ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టు పై 2-0 స్కోరుతో ఘనవిజయాన్ని నమోదు చేసింది.గీతం జట్టు క్రీడాకారిణులు రవీనా, ఎ.అలేఖ్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్టు విజయానికి కారణం అయ్యారు.

ప్రీ క్వార్టర్ ఫైనల్ ఫలితాలు

జెఎన్‌టియు హైదరాబాద్ జట్టుపై ఎస్‌ఆర్‌ఎమ్ విశ్వవిద్యాలయం జట్టు 2-0 స్కోరుతో విజయం సాధించగా, రాయలసీమ జట్టుపై ఆంధ్రవిశ్వవిద్యాలయం జట్టు 2-0 స్కోరుతో, డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టుపై గీతం జట్టు 2-0 స్కోరుతో, కాలకట్ విశ్వవిద్యాలయం జట్టుపై భారతీయర్ జట్టు 2×0 స్కోరుతో విజయాలను నమోదుచేశాయని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు.

ఆన్‌లైన్‌లో గీతం ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

విశాఖపట్నం: గీతం విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్‌లతో పాటు బెంగళూరు క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్‌లో 10 బి.టెక్ కోర్సులకు 17ఎమ్.టెక్ కోర్సులకు, బి.ఫార్మశి, ఎమ్.ఫార్మశి కోర్సులకు, ఐదేళ్ల బి.ఆర్క్ కోర్సుకు, రెండేళ్ల ఎమ్.ఆర్క్ కోర్సులకు గ్యాట్-2018 ప్రవేశ పరీక్షను అఖిల భారత స్థాయిలో దేశంలోని 48 పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశాలకు గ్యాట్-2018 రాయవలసి ఉంటుందన్నారు. గ్యాట్-2018 ప్రవేశ పరీక్షకు సంభందించిన దరఖాస్తులు దేశ వ్యాప్తంగా అన్ని యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్ శాఖలలో లభిస్తాయని అడ్మిషన్ల డైరెక్టర్ పేర్కొన్నారు. గీతం ఇంజనీరింగ్ ప్రవేశ పరిక్షకు ఆన్‌లైన్‌లో **www.gitam.edu** ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను 2018వ సంవత్సరం మార్చి 26వ తేది లోగా అందజేయవలసి ఉంటుందన్నారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి గీతం వెబ్‌సైట్ లో హాల్ టికెట్‌లను డౌన్ లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

ఏప్రిల్ 11 నుంచి 26వ తేదీ వరకు ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ విధానంలో గత 10 సంవత్సరాలుగా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న ఘనత గీతం విశ్వవిద్యాలయానిదేనని తెలిపారు. ప్రవేశ పరీక్ష పూర్తి అయిన వారం రోజులలో అంటే ఏప్రిల్ 30న ఫలితాలను వెల్లడిస్తామని అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర, తెలిపారు..

మ 'ందు'త్తు

యథేచ్ఛగా బెల్టుషాపులు
ఎత్తివేత జిఒకు తూట్లు
సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు
చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బెల్టు షాపుల ఎత్తివేత జిఒకు ఎక్సైజ్ శాఖ తూట్లు పొడుస్తుంది. జిఒలు, సాక్షాత్తూ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ఆదేశాలను సైతం బేఖాతారు చేస్తూ బెల్టుషాపులకు అనధికారిక అనుమతులు ఇచ్చి ఇబ్బడి ముబ్బడిగా మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల్లో బెల్టుషాపులను ఎత్తివేస్తం హామీ ఇచ్చింది.. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత హామీని విస్మరించింది. దీనిపై ప్రతిపక్షాలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు, మహిళ సంఘాలు తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేశాయి. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం ఏడాది క్రితం బెల్టుషాపులను ఎత్తివేస్తూ జిఒ జారీ చేసింది. దీనిని అమలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలాలు, నియోజకవర్గాలు స్థాయిలో వైన్ సిండికేట్‌లతో కుమ్మక్కై ఇరువురు సమన్వయంతో దోచుకుంటున్నారు.



బెల్ట్‌షాప్ ఇదే.

జిఒ అమలుపై అలసత్వం

బెల్టుషాపులను ఎత్తివేస్తూ, నిషేధిస్తూ ప్రభుత్వ ఏడాది క్రితం జారీ చేసిన జిఒపై ఎక్సైజ్ పోలీసులు చేసిన హడావుడి, ఆర్భాటం అంతా ఇంతా కాదు. ప్రతి పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శులకు ఎక్సైజ్ పోలీసులు లెటర్స్ పంపించి పంచాయతీ పరిధిలో బెల్టుషాపులు నిర్వహించవద్దని అవగాహన కల్పించారు. ఆయా లెటర్స్‌పై సంతకాలు కూడా తీసుకున్నారు. అంత వరకు బాగానే ఉన్న వారి ఆదేశాలు, సంతకాలు కేవలం కాగితాలకు పరిమితమయ్యాయి. కంచె చేను మేసిన చందంగా అమలు చేయాల్సిన అధికారులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. జిల్లా స్థాయి టీమ్‌తో బెల్టుషాపులపై దాడులు జరుగుతున్నప్పుడు ఎక్సైజ్‌శాఖ సిఐలు, ఎస్‌ఐలు ముందుగానే సదరు బెల్టుషాపు, వైన్‌షాపు యజమానులకు సమాచారం అందిస్తున్నారు. దీంతో వారు ముందుగానే సర్దుకొని బెల్టుషాపులు లేనట్లుగా నటిస్తున్నారు.

గ్రామాల మధ్యలో వైన్‌షాపులు

గ్రామాల మధ్యలో వైన్‌షాపులు ఉండకూడదనే నిబంధనలు ప్రకటనలకే పరిమితం అవుతుంది. షాపులకు అనుమతులు ఇచ్చేటప్పుడు గ్రామాల మధ్యలో ఉండకూడదని నిర్ణయంతో ఊరి చివర ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల తర్వాత అనూహ్యంగా గ్రామాల మధ్యలోకి మార్చారు. తుమ్మపాల, రేబాక, కొండుపాలెం తదితర గ్రామాల్లో ఊరి చివర్ల బ్రాంది షాపులు ఏర్పాటు చేసి వాటిని యథేచ్ఛగా రోడ్లపైకి తీసుకువచ్చారు. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు స్పందించలేదు.

8 వైన్ షాపులు, 4 బార్లు

అనకాపల్లి పట్టణంలో 8 వైన్‌షాపులు, నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. మండలంలో 10 వైన్‌షాపులు ఉన్నాయి. అనకాపల్లి మండలంలో 35 పంచాయతీలు ఉన్నాయి. గ్రేటర్‌లో మూడు విలీనమయ్యాయి. దీంతో ప్రస్తుతం 32 పంచాయతీలు ఉన్నాయి. 32 పంచాయతీలకు 10 వైన్‌షాపులు ఉన్నాయి.

బొగ్గు రవాణా లారీలపై బండారు ఆగ్రహం

ప్రజాశక్తి-విశాఖపట్నం

బొగ్గు రవాణా లారీలను పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అడ్డుకున్నారు. బుధవారం జన్మభూమి కార్యక్రమంలో భాగంగా వెళ్తున్న ఆయన లంకెలపాలెం నుంచి పైడివాడ అగ్రహారం మీదుగా బొగ్గు, క్వారీ లారీలు రావడతో ఆయన అడ్డుకున్నారు. కాలుష్యంతో పైడివాడ అగ్రహారం ప్రజలు బాధపడ్డంతో ఆయన బొగ్గు, క్వారీ లారీల రవాణాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలపై టార్పాలిన్ కప్పకుండా రవాణా చేయడంపై రవాణా శాఖాధికారులు, పోలీసులకు ఫోన్లో సమాచారం అందించారు. దుమ్ము, ధూళి పైకి రాకుండా జాగ్రత్తలు తీసుకోకపోతే లారీల రవాణాను పూర్తిగా అడ్డుకుంటానని హెచ్చరించారు. కాలుష్యం భారిన పడకుండా చర్యలు తీసుకుంటానని గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బండారుతో పాటు పైడివాడ అగ్రహారం ఎంపిటిసి అక్కిరెడ్డి దుర్గినాయుడు, సర్పంచ్ దాసరి వెంకటరమణ, మాజీ సర్పంచ్ బొబ్బిరి కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సావిత్రిబాయి పూలే జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

మద్దిలపాలెం:ఆంధ్ర యూనివర్శిటీ కాన్వకేషన్ హాల్లో బుధవారం ఎపి సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో తొలి భారత మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా "మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా రూపొందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ విద్యకు ప్రాధాన్యతనిస్తూ సుమారు రూ. 23 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించడమయిందన్నారు. రాష్ట్రంలోని పాఠశాలలన్నింటిలో మౌలిక వసతులు కల్పిస్తూ నాణ్యవంతమైన విద్యను అందించే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని మహిళలు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా నేడు ఉపాధ్యాయులుగా పనిచేయడాన్ని మహిళలు ఎక్కువ ఉత్సాహాన్ని చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా ఎంపికైన 86 మందికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, జె సి సృజన, జెసి 2 సిరి, ఎయు రెక్టార్ ఆచార్య కె గాయత్రి దేవి, ఎయు విసి సతీమణి విజయలక్ష్మి సర్వ శిక్షా అభియాన్ రాష్ట్ర పథక సంచాలకులు జి శ్రీనివాస్, విశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి శివ రామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా వివిధ పాఠశాలలనుంచి వచ్చిన విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సీతమ్మధార: ప్రతి మహిళ సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని విశాఖ డిస్ట్రిక్ట్ జడ్జి పివి జ్యోతిర్మయి అన్నారు. బుధవారం విశాఖ పౌర గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 187వ జయంతోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళల కోసం ఎంతో కృషి చేసారన్నారు. ఆమె పేరుతో ట్రస్ట్ ఏర్పరిచి అవయవ, శరీర దాన, ఉద్యమాన్ని ఒక సామిజిక ఉద్యమంగా నిర్వహిస్తున్న జి సీతామహాలక్ష్మి అభినందించారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాలలో 80 మంది సామాజిక సేవలను మరో 70 సేవా సంస్థలకు సావిత్రిబాయి విశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ విజయ్‌కుమార్, ఎయు రిజిస్ట్రార్ వి ఉమామహేశ్వరరావు, ఆంధ్రా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ పివి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : జివిఎంసి ఆరోవార్డు పరిధి ఎండాడ ఉన్నత పాఠశాల్లో సావిత్రిబాయి పూలేజయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల్లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళిఅర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమె జీవిత విశేషాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమేష్, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సూర్యనారాయణ, శ్రీనివాసరావు, దేముడు, తిరుమలరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : అతిశూద్ర మహిళలకు చదువుకునే అవకాశం కల్పించేందుకు సావిత్రీబాయి పూలే దంపతులు అవిశ్రాంత పోరాటం చేసి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచారని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి శ్రీరామమూర్తి అన్నారు. భారత నాస్తిక సమాజం, సమాజ చైతన్యవేదియ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం చిన వాల్తేర్ జివిఎంసి హైస్కూల్ ప్రాంగణంలో భారత దేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే 187వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమాజ చైతన్య వేదిక కార్యదర్శి ఎన్ బిమూర్తి భారత నాస్తిక సమాజం నాయకులు రాంప్రభు, న్యాయవాది సురేష్, హేతు ప్రసాద్, ప్రొ. మంజులత, అనంతరావు (అరసం) విరియాల గౌతం, (అరసం) వాసు బొబ్బాది అప్పారావు పాల్గొన్నారు.

పద్మనాభం:మండలంలోని రేవిడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని బుధవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు టి.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ మహిళా ఉపాధ్యాయులు బి.సూర్యకుమారి, మల్లీశ్వరి, ఎన్.సుహాసినిలకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భారదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను విద్యార్థులకు వివరించారు. ఏటా ఆమె జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పలువురు మహిళా ఉపాధ్యాయులు, రేవిడి ఎంపిటిసి అవాల గంగరాజు, గ్రామ నాయకులు పి అప్పలనాయుడు, పాల్గొన్నారు.

తగరపువలస: సావిత్రి భాయి పూలే జయంతిని స్థానిక జివిఎంసి-భీమిలి జోన్-1 వ వార్డు బంగ్లా మెట్టలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడారు. తొలుత సావిత్రి భాయిపూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ రమేష్, విద్యావాలంటీర్ పద్మ పాల్గొన్నారు.



సీనియర్ మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


చికెన్ ధరలు

బాయిలర్ (బ్యాగ్) లైవ్	రూ. 95.00
విత్ స్కిన్	రూ.160.00
స్కిన్ లెస్	రూ.170.00
కోడిగుడ్లు (100 గుడ్లు)	రూ.366.00

అత్యవసర సమాచారం

కింగ్ జార్జ్ ఆసుపత్రి	- 2564891
విక్టోరియా ఆసుపత్రి	- 2562637
మెంటల్ ఆసుపత్రి	- 2754918
ఎవిఎస్ రాజా రక్తనిధి కేంద్రం	- 2543436
పోలీస్ కంట్రోల్ రూమ్	- 100, 2565454
క్రైమ్ స్టాపర్	-1090
ఆర్టీసీ	- 2746400
తాగునీటి ఫిర్యాదులు	- 2517261
ఫైర్	- 101
రైల్వే రిజర్వేషన్ ఎంక్వైరీ	- 135
వంట గ్యాస్	- 2578158
విద్యుత్ సమాచారం	- 2718091
ఇండియన్ ఎయిర్ లైన్స్	- 2746501

సినిమా... సినిమా



టూ కంట్రీస్ : జోతి, వి మ్యాక్స్ 3, శ్రీరామ, శ్రీ నరసింహ (గోపాలపట్నం)

ప్రాజెక్టు : శ్రీ లీలామహల్, పరమేశ్వరి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం)

జూమంజి : శారద, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం)

ఒక్క క్షణం : వి మ్యాక్స్ 1, కిన్నెర, శ్రీ లక్ష్మీ నరసింహ (104 ఏరియా), సత్యం (గోపాలపట్నం)

హలో : మెలోడి, సంగం, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (సుకన్య)

ఎంసిఎ : జగదాంబ, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీ లక్ష్మీ నరసింహ స్క్రీన్ 1 (104 ఏరియా), శంకర (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్‌విసి లిఖిత (శ్రీహరిపురం), కన్య స్క్రీన్ 1 (గాజువాక), ఎస్‌టిబిఎల్ స్క్రీన్ 2 (శీలానగర్)

ఇఈ : వి మ్యాక్స్ 3

ఖాకీ : వెంకటేశ్వర స్క్రీన్ 2

టైగర్ జిందగీ హై : రమాదేవి

రాజా ది గ్రేట్ : శ్రీకాంతి

జవాన్ : వి మ్యాక్స్ 2

ఉద్యోగులను తొలగించడం సరికాదు

విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమసంఘం

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

బిసి నేత, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ఇటీవల విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పరిశా వెంకటేశ్వర్లును తొలగించడాన్ని రాష్ట్ర విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది.

డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్న కృష్ణయ్యను తొలగించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని నియమించాలని తీర్మానం జరిగిందన్నారు. అంతేగాని తమను తొలగించే అధికారం హక్కు గౌరవాధ్యక్షుడిగా కృష్ణయ్యకు లేదన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన కమిటీని రద్దు చేసే అధికారం ఆయనకు లేదన్నారు. ఇప్పటికైన ఈ విషయన్ని ఆయన గమనించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

'డిసిఐ ప్రయివేటీకరణ సరికాదు'

డాబాగార్డెన్స్:డిసిఐని ప్రైవేటీకరిస్తు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మారిటైమ్ యునియన్ ఆఫ్ ఇండియా (యంయుఐ), నేషనల్ యూనియన్ ఆఫీసర్స్ ఆఫ్ ఇండియా (నూసి)లు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ మేరకు నూసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గని శేరంగ్, యంయుఐ ప్రధాన కార్యదర్శి అమర్ సింగ్ ఠాకూర్‌లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సంస్థను ప్రైవేటీకరణ చేయడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నావికులంత ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు చేయవలసి వస్తుందని హెచ్చరించార్రు.

దళిత బహుజన పార్టీ ఉత్సవాలు

డాబాగార్డెన్స్:ఈ నెల1నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు నగరంలో జరిగే 'భీమ్ కారో గావ్ మహావీర్ రెజిమెంట్ విజయ దివస్' మహోత్సావాలను విజయవతం చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు కృష్ణస్వరూప్ అన్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టరును డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం దళిత బహుజన పార్టీ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవివక్షతకు వ్యతిరేకంగా, దళితుల అణిచివేత సమాజసమనత్వం కోసం విజయ్ దివస్ చేసిన కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రామచంద్రరావు, పార్టీ వివాహ జిల్లా వాఖ అధ్యక్షులు బి రమేష్, నాయకులు వెంకటేష్, జగదీష్ పాల్గొన్నారు.

జన్మభూమిలో భారీగా దరఖాస్తులు

కలెక్టరేట్:దక్షిణ నియోజకవర్గంలో రెండవ రోజైన బుధవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జన్మభూమి - మన ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అధ్యక్షత 20, 21 వార్డుల జన్మభూమి జరిగింది. జివిఎంసి జోన్ -3 కమిషనర్ వి చక్రధర్, ఎపిఇపిడిసిఎల్ అధికారి ఎంఎం నాయుడు, తదితరులు హాజరయ్యారు. రేషన్ కార్డుల కోసం, ఇళ్ల స్థలాలు, రుణాల కోసం వందలాది మంది అర్జీలను ఎమ్మెల్యే గణేష్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి 20వ వార్డు అధ్యక్షులు పరదేశి యాదవ్, 21వ వార్డు అధ్యక్షులు సిఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాస్పందన కార్యక్రమం

డాబాగార్డెన్స్:ఈ నెల5వ తేదీన ద్వాకానగర్ పబ్లిక్ లైబ్రరీలో "ఫుట్‌ప్రింట్స్ ఆఫ్ గోల్డ్ మైనింగ్ హెరిటేజ్ ఇన్ ఇండియా" అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజాస్పందన అధ్యక్షులు సిఎస్ రావు తెలిపారు. సాయంత్రం 5.30గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎయు ఉపకులపతి ఆచార్య జి నాగేశ్వరరావు, అతిథులుగా ఇండియన్ బ్యూరో ఆఫ్ మినిస్ట్రీస్ కంట్రోలర్ జనరల్ రంజన్ సాహి, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి ఉమామహేశ్వరరావు, ఎయు మాజీ ఆచార్యులు చందుసుబ్బారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

బుర్రి కుమార్ రాజుకు వృద్ధ మిత్ర పురస్కారం

కలెక్టరేట్:విశాఖపట్నం ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో సహాయ గ్రంథ పాలకుడు, రాష్ట్ర రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడు,కవి బుర్రి కుమార్ రాజుకు "వృద్ధ మిత్ర" సాహితీ సత్కారం లభించింది. ఈ విషయాన్ని కుమార్ రాజు స్థానికమీడియాకు తెలిపారు. విజయనగరం జిల్లా తోటపల్లి జట్టు శిక్షణ కేంద్రంలో జరిగినసత్కార కార్యక్రమంలో రాజు సాహితీ సేవలకు శాలువ, మెమోంటోలతో సత్కరించారు. జట్టు సంస్థ అధ్యక్షులు డాక్టర్ డొల్లు పారినాయుడు తన తల్లి సన్యాసమ్మ 91వ వసంతంలో అడుగిడు సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కుమార్ రాజును సత్కరించి అభినందించారు.

మహిళల సంక్షేమమే టిడిపి ధ్యేయం

జన్మభూమి సభలో మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - ఆరిలోవ

ప్రజా సంక్షేమంతో పాటు మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు పునరుద్ఘాటించారు. ఒకటోవార్డు పరిధి ఆరిలోవ కాలనీ, చివరి బస్టాపు వద్ద గల శ్రీ సాయి కల్యాణమండపంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన ఐదో విడత జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ఘనత టిడిపి ఆధ్వర్యంలో సర్గీయ ఎన్‌టిఆర్ నుండి నేడు చంద్రబాబు వరకు కొనసాగుతుందన్నారు. దీనిలో భాగంగానే మహిళలకు రిజర్వేషన్‌తో పాటు అన్ని రంగాల్లో మంచి ప్రాధాన్యత కల్పించినట్టు ఆయన తెలిపారు. దీనిలో భాగంగానే మహిళ పేరుమీద పట్టాలు, ఇళ్ల మంజూరు వంటివి కల్పించినట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 51 లక్షల మందికి పింఛన్లు, పెళ్లి కానుకగా బిసి, ఎస్‌సి, మైనార్టీలకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఇంట్లో పెద్ద దిక్కు కోల్పోయిన వారి చంద్రన్న బీమా పథకం ద్వారా బీమా సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు వెలగపూడి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు రేషన్ కార్డులు, సామాజిక పింఛన్లు, ఇళ్ళ స్థలాలకోసం కొత్తగా దరఖాస్తులు పెట్టుకోవచ్చన్నారు.


జన్మభూమిలో మాట్లాడుతున్న మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు


సభలో మహిళలకు కానుకలు అందజేస్తున్న మంత్రి అయ్యన్న, ఎమ్మెల్యే వెలగపూడి

అనంతరం వార్డు పరిధిలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, పింఛన్లు, పట్టాలు, ఇంటి పన్ను పుస్తకాలు, చంద్రన్న సంక్రాంతి కానుకలు, అర్హులైన లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని అలరించాయి. ఈ కార్యక్రమంలో జివియంసి కమిషనర్ హరినారాయణన్, జెడ్సీ పిఎం సత్యవేణి, జిల్లా వైద్యాధికారి రమేష్, ప్రత్యే పర్యవేక్షణాధికారిణి వైవి అనురాధ, జివియంసి అధికారులు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు పొత్రకండ ధార్మారావు, యల్లమిల్లి సురేష్, మహిళా అధ్యక్షులు నల్లాని వరలక్ష్మి, నగర ఉపాధ్యక్షులు మజ్జి రమణి, నీలి అప్పలరాజు, గోపాల్, ఏసుబాబు, పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మంత్రి అయ్యన్నకు సిపిఐ వినతి..

ఎక్కువ మంది పేద, బడుగు, మధ్యతరగతి, కార్మికులు నివాసం ఉండే ఆరిలోవ ప్రాంతంలో రైతుబజార్, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు పిల్లి వీర్రాజు ఆధ్వర్యంలో మంత్రి అయ్యన్న పాత్రుడుకి వినతి పత్రం అందజేశారు.


క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి గంటా

ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం

జాతీయస్థాయిలో ఏపిజట్లు విజయకేతనం

అభినందించిన మంత్రి గంటా

ప్రజాశక్తి-విశాఖపట్నం

రాష్ట్రంలో ప్రతిభ పాటవాలు ప్రదర్శించే క్రీడాకారులకు ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. జాతీయ స్థాయి టార్గెట్ బాల్ విజేతలను బుధవారం మంత్రి గంటా శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్‌లో బాలుర, బాలికల జట్లు వరుసగా విజయాలు సాధించడం ప్రశంసనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్‌లు మాట్లాడారు. జాతీయ స్థాయి పోటీల్లో నాలుగు సార్ల రాష్ట్ర జట్లు విజయం సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. క్రీడాకారుల ప్రతిభా పాటవాలను ప్రభుత్వం గుర్తించే విధంగా కృషి చేస్తామన్నారు. విశాఖ వేదికగా త్వరలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట రామకృష్ణ

'అ ఆ క్యాలెండర్' ఆవిష్కరణ

దాబాగార్డెన్స్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంబేద్కర్ ఆలోచన (అ.ఆ) ఫౌండేషన్ రూపొందించిన 2018 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఘనంగా నిర్వహించింది. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి వెంకటరామకృష్ణ, న్యాయవాది బైపా అరుణ్‌కుమార్, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి నాయవ్యావాదుల సంఘం ప్రతినిధులు వి.లక్ష్మన్న, ఎం సుబ్బయ్య, బీమన్న, వి చిన్నారావు, కదరి రాము తదితరులు ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పి వెంకట రామకృష్ణ మాట్లాడుతూ దళితుల రాజ్యాధికార దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దళిత గిరిజనలకు హక్కుల, రక్షణ భరోసాకై నిరంతరం అ.ఆఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు.న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులు విద్యావంతులు బహుజనులు అంబేద్కర్ ఆలోచన విధానంలో పయనిస్తూ భారతదేశాన్ని అంబేద్కర్ కలలుగన్న సంక్షేమ రాజ్యంగా చేసేటందుకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో టి లక్ష్మణరావు, జి మన్ను, శశికళ, పాకా సత్యనారాయణ, వై ఈశ్వరరావు, జి మహేశ్వరరావు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కియో మోటార్స్ ఇండియా సిఇఒగా 'కుక్ హుస్ షిమ్'

అనంతపురంలో పరిశ్రమ

2018లో పనులు - 2019లో కార్ల ఉత్పత్తి ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

ఆటోమోటివ్ రంగంలో 30ఏళ్ల అనుభవం గల కుక్ హుస్ షిమ్‌ను కియో మోటార్స్ ఇండియా సంస్థ ఎండి, సిఇఒగా నియమించినట్లు ఆ సంస్థ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఏపి ప్రభుత్వం కియో సంస్థతో గతంలో చేసుకున్న ఒప్పందం (ఎంఒయూ) ప్రకారం అనంతపురంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో కియో మోటార్స్ ఇండియా ప్రారంభించిందని, 2018లో పనులు ప్రారంభమవుతాయని, 2019లో కార్ల ఉత్పత్తిని చేపడుతుందని వెల్లడించింది. ఏటా 3లక్షల కార్లను సంస్థ ఉత్పత్తి చేయనుందని, ప్రపంచంలో 5వ స్థానంలో కియోమోటార్స్ సంస్థ ఉందని తెలిపింది. అనంతపురంలో కియో కార్ల తయారీతో దేశంలో తొలి కేంద్రం ఇదే కానుందని పేర్కొంది. కొరియాలో 1944 సంవత్సరంలో కియోమోటార్స్ ప్రారంభమైనట్లు తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా తమ మోటార్స్ సంస్థలో 51వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

ఐదు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు

పద్మనాభం మండలంలో పెంట, అనంతవరంలో 300 ఎకరాలు, పెందుర్తి నియోజకవర్గంలోని పెందుర్తి మండలం గుర్రంపాలెంలో 129.99 ఎకరాలు, గాజువాక నియోజకవర్గంలోని గాజువాక మండలంలో తలరివనిపాలెం, అగనంపూడి, దువ్వాడలో 120 ఎకరాలు, అనకాపల్లి నియోజకవర్గంలోని అనకాపల్లి మండలంలో కుంచంగిలో వంద ఎకరాల విస్తీర్ణంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు భూములను సిద్ధం చేస్తోంది. తొలి దశలో భూములను సిద్ధం చేసిన తరవాత పరిశ్రమల ఏర్పాటు వేగవంతమైతే రెండో దశలో మరికొంత భూమిని సిద్ధం చేయనుంది.

పెద్దలపై చర్యలేవీ?

ఏయే గుర్తింపు పత్రాలు సమర్పించింది? అసలు ఆమె వయసు ఎంతనేది తెలియకుండానే అధికారులు పనిలోకి తీసుకున్నారా? ఏడేళ్లగా ఆ బాలికతో ఎలా పనిచేయించుకుంటున్న అధికారులు వారి యోగక్షేమాలు పట్టించుకోరా? కేవలం మూడు వేల రూపాయలు వేతనంతో వెట్టి చాకిరీ చేయిస్తున్నా యాజమాన్యం తీరుపై మండిపడుతున్నారు. అసలు అక్కడ పని చేసే ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు అందుతున్నాయా లేదా అనేది సందేహం కూడా మొదలవుతుంది. మూగ బాలికకు గుర్తింపు కార్డు గనుక జారీ చేసి ఉంటే ఆధార్‌కార్డు చూసి వయస్సు ధ్రువీకరించిన తరువాత కార్డు మంజూరు చేస్తారు. కనీసం అధికారులు ఆధార్ కార్డులోని వయసు తదితరాలను చూడకుండానే ఎంట్రీ పాస్ ఇచ్చేశారా అనేది కూడా ప్రశ్నగ్గానే మిగిలింది. కాంట్రాక్టరు, సెక్యూరిటీ అధికారితో పాటుగా హెచ్‌బిఎల్ అధికారుల మధ్య లాలూచీ ఉండటంతోనే ఎటువంటి ఆధారాలు లేకుండానే పనిలో చేర్పించుకుంటున్నారన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ఎస్ఇజెడ్‌లో ఒప్పంద కార్మికుల నియామకాలు, వారికి వేతన చెల్లింపుల విషయంలో పెద్ద కుంభకోణం నడుస్తుందేమోననే భావన కలుగుతోంది. అమాయక గిరిజనులను పనుల నిమిత్తం తీసుకొచ్చి వారితో వెట్టి చాకిరీ చేయించుకుని చాలీచాలని వేతనాలు వారి చేతిలో పెట్టడమే కాకుండా ఇలాంటి అత్యాచారాలకు పాల్పడటంపై నగరమంతా అట్టుడుకుపోతోంది. బాధిత బాలికకు న్యాయం చేయాలని ప్రజా, మహిళా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

డిసిఐ ప్రయివేటీకరణపై 5న ప్రజా బ్యాలెట్

ప్రజాశక్తి-కలెక్టరేట్

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రయివేటీకరణను నిరసిస్తూ నగరంలోని 200 సెంటర్లు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, కార్మిక, ప్రజా కూడళ్ల వద్ద శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 'ప్రజా బ్యాలెట్'ను నిర్వహించనున్నట్లు సిఐటియు విశాఖ నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు చెప్పారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రజా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సీహార్స్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న డిసిఐ దీక్షా శిబిరంలో శనివారం లెక్కింపు చేపడతామని తెలిపారు. అనంతరం సభ ఉంటుందని చెప్పారు. ఈ సభకు సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. విశాఖ అఖిల పక్ష కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్ల నాయకులు పాల్గొంటారని చెప్పారు. నగరంలోని కార్మికులు, ఉద్యోగులు, ప్రజానీకం పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

డిసిఐ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వి ఎ న్ . వ ద్మ నా భ ^ రా జు మాట్లాడుతూ, డిసిఐ ప్రయివేటీకరణను బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. స్థానిక బిజెపి ఎంపీ కంభంపాటి హరిబాబు డిసిఐ ప్రయివేటీకరణపై విశాఖ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 5న జరిగే ప్రజా బ్యాలెట్‌లో నగర ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పద్మనాభరాజు,జగ్గునాయుడు తదితరులు

సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు, ప్రభావతి, శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్

అచ్యుతాపురంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించే సిపిఎం విశాఖ జిల్లా 22వ మహాసభలను, 6వ తేదీన చేపట్టే బహిరంగ సభను జయప్రదంచేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, బి.ప్రభావతి, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మహాసభల ప్రారంభం రోజైన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభలో పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర నాయకులు సిహెచ్.నరసింగరావు, డాక్టర్ మిడియం బాబూరావు పాల్గొంటారని చెప్పారు. జగదాంబ సమీపంలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వ ం వ ^ ొ న బ. ^ ల క ం సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుతం నెలకొన్న సంక్లిష్ట రాజకీయాలలో విలువలు, నిబద్ధత, క్రమశిక్షణ, అవినీతికి తావులేని పార్టీగా సిపిఎం నిలిచిందన్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి, కార్మిక, కర్షక, ప్రజా పక్షపాతిగా ప్రజాసేవలో నిస్వార్థంగా అవిరళ కృషి చేస్తుందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి, అన్ని వర్గాల ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరు సలుపుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేసిన ప్రతి సందర్భంలోనూ పార్లమెంట్‌లోను, బయట సిపిఎం ఆధ్వర్యాన పోరాటాలను చేపడుతుందని తెలిపారు. ప్రజా పోరాటాలతోపాటు ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అనేక రూపాల్లో సిపిఎం తన సేవా కార్యక్రమాలను జిల్లా వ్యాపితంగా నిర్వహిస్తుందన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల రెగ్యులర్‌కు డిమాండ్

27 నుంచి నిరవధిక సమ్మె

ప్రజాశక్తి- కలెక్టరేట్


విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి డిపార్ట్‌మెంట్ నేరుగా జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక నాయకులు బి.దుర్గాప్రసాద్, జి.సంతోష్‌కుమార్, కె.వసంతరావు డిమాండ్ చేశారు. ఐక్యవేదిక ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలలో గత రెండు దశాబ్దాలుగా 23 వేల మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. విద్యుత్ రంగంలో 3వ పార్టీ కాంట్రాక్టు వ్యవస్థ కార్మిక చట్టాలు, రాజ్యాంగ, మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అనుభవాన్ని, వయసును పరిగణలోకి తీసుకుని దశలవారీగా తమను క్రమబద్ధీకరించాలని, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియో, మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బిల్లు కలెక్టర్లకు, మీటర్ రీడర్లకు పీస్‌రేటు రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, విద్యుత్ రంగంలో సర్వీస్, అవుట్ సోర్సింగ్ విధానాలను ప్రవేశపెట్టి ప్రయివేటీకరించాలనే ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ డిమాండ్ల సాధనకు జెఎసి పిలుపు మేరకు ఈ నెల 27 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్.అప్పలనాయుడు, సిహెచ్.కనకరాజు, ఎస్‌విఎస్.రామారావు, మోహన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఎస్‌టిలో చేర్చేందుకు కృషి

ముఖ్యమంత్రితో మాట్లాడిస్తా : మంత్రి గంటా

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఆర్థికంగా, సామాజికంగా వెనుక బడిన మత్స్యకారులను ఎస్‌టిలో చేర్చే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. గురువారం నగరానికి వస్తున్న చంద్రబాబు పోర్టు గెస్ట్ హౌస్‌లో బస చేస్తున్నారని, అక్కడికి మత్స్యకార ఎస్‌టి సాధన సమితి నాయకులు వస్తే ఆయనతో నేరుగా మాట్లాడిస్తానని చెప్పారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 8వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని మంత్రి గంటా శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌టిలో చేర్చడమే ప్రధాన సమస్యగా వారు వివరించారు. మంత్రితో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉన్నారు. దీక్షా శిబిరంలో మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, పిసి అప్పారావు, మాజీ కార్పొరేటర్ బుడ్డా నీలకంఠం, గంటా పాపారావు, మూగి శ్రీరామమూర్తి, డి.రామకృష్ణ, మూగి సూర్యనారాయణ, మూగి రాముడు, తిరుపతి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



8వ రోజు శిబిరంలో కూర్చున్న మత్స్యకారులు, మత్స్యకార నేతలు

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

వైసిపి మహిళా నేతల డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్

దువ్వాడలోని విఎస్‌ఇజెడ్‌లో 14 ఏళ్ల గిరిజన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ మానవ మృగాన్ని, అతనికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని వైసిపి నగర మహిళా విభాగం అధ్యక్షులు గరికిన గౌరీ, పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం జగదాంబ దరి వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో ఎస్‌సి మహిళను వివస్త్రను చేసి తెలుగుదేశం పార్టీకి చెందిన వారు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన మరువక ముందే దువ్వాడ సెజ్ వద్ద గిరిజన బాలికపై ఢిల్లీ నిర్భయ ఘటనను గుర్తుచేసేలా అత్యాచారం జరపడం సిగ్గు చేటన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో మహిళలకు, హరిజనులకు, గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వికలాంగ గిరిజన బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిపై నిర్భయ చట్టంతోపాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదుచేయాలని, బాధితురాలికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో పీలా వెంకటలక్ష్మి, మళ్ల ధనలత, యువశ్రీ, మేరుగలమాల శ్రీదేవి, సమీరా బేగం, సుజాత తదితరులు పాల్గొన్నారు.


సరుకు రవాణాలో పోర్టు అరుదైన రికార్డు

ప్రజాశక్తి-విశాఖపట్నం

విశాఖపట్నం పోర్టు ట్రస్టు నందలి ఇన్నర్ హార్బర్‌లోని ఇక్యు 8, ఇక్యు 9 బెర్తులను నిర్వహిస్తున్న బిఒటి ఆపరేటర్ వైజాగ్ సీపోర్టు ప్రయివేటు లిమిటెడ్ ఒకే నెలలో 7.05 లక్షల సరకు రవాణాను చేపట్టిందని, ఇది అరుదైన రికార్డు అని వైజాగ్ సీపోర్టు ప్రయివేటు లిమిటెడ్ సిఇఒ శ్రీరంగం కిశోర్ తెలిపారు. 2004 జులైలో వాణిజ్య సరుకుల రవాణా నిర్వహణ కోసం బిఒటి ప్రాజెక్టు ప్రారంభమైందని, తమ బెర్తుల వద్ద అన్ని రకాల భారీ సరుకులు (కార్గోలు) చేపట్టుటకు లైసెన్స్ పొందిందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం అంటే 2017-18లో ఇప్పటి వరకు 5.30 మిలియన్ టన్నుల సరుకు రవాణాను పూర్తిచేసిందని, తమ లక్ష్యం 7 మిలియన్ టన్నులని, 2018 మార్చి నాటికి చేరుకుంటామని తెలిపారు.

తెలుగు భాష పరిరక్షణ అవసరం

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



కలెక్టరేట్ : తెలుగు భాష పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టాలని లోక్‌నాయక్ ఫౌండేషన్ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కోరారు. 2018ని తెలుగు భాష పరిరక్షణ సంవత్సరంగా ప్రకటిస్తూ చంద్రబాబు చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని లోక్‌నాయక్ ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నామ ఫలకాలు, శిలాఫలకాలు తెలుగులో ఉండేలా గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసేలా చర్యలు గైకొనాలని కోరారు. జన్మభూమి కార్యక్రమాలకు హాజరయ్యే ముఖ్యమంత్రి సహ ప్రజాప్రతినిధులందరూ తెలుగు భాష పరిరక్షణ కోసం ఐదు నిమిషాలు కేటాయించాలన్నారు. తెలుగు మాధ్యమంలో బోధనలను పరిశీలించాని కోరారు. ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మేరకు రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వ విద్యాలయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

చంద్రబాబు పాలనలో మహిళలకు అన్యాయం

తైనాల విజయ్‌కుమార్

కలెక్టరేట్ : చంద్రబాబు పాలనలో మహిళలకు అన్యాయం జరుగుతోందని విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం వైసిపి అధ్యక్షులు తైనాల విజయ్‌కుమార్ ఆరోపించారు. మహిళా సాధికారిత తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పదే పదే చెబుతూ, పాఠశాల బాలికలను జన్మభూమి కార్యక్రమానికి తరలిస్తున్నారని, ఇదేనా మహిళా సాధికారిత అని ప్రశ్నించారు. జగదాంబ వద్ద గల వైసిపి కార్యాలయంలో బుధవారం సావిత్రి బాయి పూలే 187వ జయంతిని నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి తైనాల విజయ్‌కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత దేశంలో మహిళా సాధికారితకు మొట్టమొదటి పునాది వేసి గొప్ప మహిళా సామాజిక వేత్త సావిత్రిబాయి పూలే అన్నారు. కుల, మతాలకు అతీతంగా మహిళా విద్యకు ప్రాముఖ్యతను ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్త నియోజకవర్గం సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, నగర మహిళా విభాగం అధ్యక్షులు గరికిన గౌరీ, జాన్ వెస్లీ, కోలా గురువులు, పక్కి దివాకర్, బోని శివరామకృష్ణ, పీలా వెంకటలక్ష్మి, మేరుగుల శ్రీదేవి, సమీరా బేగం, సుజాత, పీలా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విశాఖ : సిఐటియు రూపొందించిన క్యాలెండర్‌ను జివిఎంసి కమిషనర్ హరినారాయణన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
వి-శాఖ
గురువారం 4
జనవరి 2018

వికసించిన క్రీడా 'కుసుమ'ం

- జాతీయ యూత్ గేమ్స్‌లో బంగారు పతకం
- అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపిక
- టోగా యూత్ గేమ్స్‌లో సత్తాచాటిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని

గ్రామీణ నేపథ్యంలో నుంచి వచ్చింది. వ్యవసాయ కుటుంబంలో పుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంది. చిన్నప్పుడు తను పెద్ద క్రీడా మైదానంలో ఆడలేదు. పెద్ద పెద్ద టోర్నమెంటులూ చూడలేదు. స్వగ్రామంలోనే క్రీడా పాఠాలు నేర్చుకుంది. ఒక్కసారిగా టోగా (ట్రెడిషనల్ ఒలింపిక్ గేమ్స్ అసోసియేషన్) జాతీయ యూత్ గేమ్స్‌లో వాలీబాల్ క్రీడలో బంగారు పతకం సాధించి, అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికయింది నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని 'కుసుమ' భూమిరెడ్డి. విద్యార్థి ఉద్యమాలలో లాఠీ దెబ్బలకూ వెరవకుండా గొంతెత్తి నినదిస్తుంది. ఆటపాటల్లో ప్రతిభ చూపడంతో పాటు చదువులోనూ సమస్థాయిలో రాణిస్తూ.. ఎందరో విద్యార్థులకు స్ఫూర్తినిస్తోంది.



ప్రజాశక్తి-మద్దిలపాలెం

కుసుమ స్వగ్రామం విజయనగరం జిల్లా, ఎల్.కోట మండలం, కల్లేపల్లి. తండ్రి వెంకటరావు, తల్లి లక్ష్మి. వ్యవసాయ కుటుంబం. పదవ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే చదువుకుంది. ప్రస్తుతం నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో రెండవ సంవత్సం ఇంటర్ చదువుతుంది. క్రీడల్లో ఆసక్తి ఉండటంతో చదువుతో పాటు ఆ దిశగా సాధన చేసింది. కోచ్‌లు పొలిపిరెడ్డి శ్రీను, సిహెచ్ గణేష్‌ల శిక్షణలతో వాలీ బాల్ క్రీడలో రాటుదేలింది.

తొమ్మిదో తరగతి నుంచే..

చిన్నప్పటి నుంచి చురుగ్గా ఉండేది. ఆటలంటే ఎక్కువగా ఇష్టపడేది. వాలీ బాల్ ఆటంటే తనకెంతో ఇష్టం. తొమ్మిదో తరగతి చదువుతుండగా తిరుపతిలో జరిగిన రాష్ట్ర క్రీడా పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తరుపున పాల్గొంది. ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో కాలేజి తరుపున వాలీ బాల్ పోటీల్లో పాల్గని జిల్లా ఫస్ట్ సాధించింది. చదువు, ఆటలతో పాటు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో పనిచేస్తూ అనేక విద్యార్థి ఉధ్యమాల్లో పాల్గొంటుంది.

నేషనల్ యూత్ గేమ్స్‌లో బంగారు పతకం గత సంవత్సరం డిశంబర్ 3న పెందుర్తి పభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన యూత్ గేమ్స్ సెలెక్షన్స్‌లో పాల్గొంది. అందులో రాష్ట్రం తరుపున ఎంపిక చేసిన పదిమందితో పాటు ఆమె కూడా ఉంది. భోపాల్‌లోని భెల్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో గతేడాది 23 నుంచి 25 వరకు జరిగిన జాతీయ యూత్ గేమ్స్‌లో జూనియర్ విభాగంలో రాష్ట్రం తరుపున పాల్గంది. ఉత్తమ ప్రతిభను కనబరిచి జట్టు గెలుపులో పాలుపంచుకుంది. బంగారు పతకాన్ని సాధించింది. త్వరలో శ్రీలంకలో జరగబోయే టోగా సౌత్ ఏషియన్ ఆటలకు దేశం తరుపున వాలీబాల్ పోటీలకు పాల్గొనే 20 మంది సభ్యులతో ఎంపికయింది.



కోచ్, సహచర క్రీడాకారిణులతో కుసుమ (కుడి వైపు నుంచి రెండో వ్యక్తి)

అభినందనల వెల్లువ

నేషనల్ యూత్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కుసుమను ఎస్ఎఫ్ఐ నాయకులు అభినందనలతో ముంచెత్తారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, వై.రాములు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నగరానికి చెందిన ఎస్ఎఫ్ఐ నాయకులు జి ప్రియాంక, ఎల్ చిన్నారి, ఎల్‌జె నాయుడు, గణేష్, అజయ్, విజయ్‌లు అభినందించారు. విజయనగరం జిల్లా కొత్తవలసలోని మంగళపాలెంనకు చెందిన శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ వారు విజయం సాధించిన రాష్ట్ర జట్టులోని సభ్యులను ఇటీవల సత్కరించారు. స్పోర్ట్స్ కిట్లు, నగదు బహుమతులు అందజేశారు.



సహచరులతో కుసుమ (కుడి వైపు నుంచి నిల్చున్న వారిలో మొదటి వ్యక్తి)

దేశం తరుపున పతకం సాధిస్తా..



రాష్ట్రం తరుపున ఎంపిక అవుతానో లేదోనని టెన్షన్ పడ్డాను. ఎంపికయిన తర్వాత నమ్మకం కుదురింది. ఎలాగైనా జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మెడల్ ప్రథమ స్థానం సంపాదించాలనే పట్టుదలగా ఆడాం. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. సౌత్ ఏషియా పోటీల్లోనూ రాణించి దేశానికి పతకం సాధిస్తాం.

– కుసుమ

కానిస్టేబుల్ ఆశయం మహోన్నతం

తైక్వాండోలో యువతకు శిక్షణ
ఉద్యోగావకాశాల మెరుగునకు కృషి
రోజుకు 50 మంది హాజరు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం

ఆయన చేసేది కానిస్టేబుల్ ఉద్యోగం, ఆశయం మాత్రం మహోన్నతం. తాను ఎదుగుతూ పది మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో స్వగ్రామంలోని యువతకు తైక్వాండోలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాడు. ఆయనే పినపాత్రుని చినబాబు. యలమంచిలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

తను పుట్టి పెరిగిన గెడ్డ రుణం తీర్చుకోవాలనే ఆశయంతో తన గురువు నగిరెడ్డి సత్యనారాయణ వద్ద 15 సవత్సరాల క్రితం నేర్చుకున్నాడు. ఈ విద్యను నేడు యువతకు నేర్పిస్తూ ఉద్యోగ ఉపాధి అవకాశాల మెరుగుకు కృషి చేస్తున్నారు. మెరుగ్గా రాణించేందుకు తైక్వాండోలో తర్ఫీదునిస్తున్నాడు. చినబాబు తైక్వాండోలో బ్లాక్‌బెల్ట్ సాధించమే కాక నేషనల్ రిఫరీగా కూడా కోర్సును పూర్తి చేశారు. గురోపదేశం ప్రకారంలో గ్రామంలో ఐదు నెలల క్రితం నుండి యువతకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రోజుకు 50 మంది యువత ఈ క్లాసులకు హాజరవుతున్నారు. స్వగ్రామమైన పెదఉప్పలం నుండే కాక లక్ష్మీపతిరాజుపేట, గుడివాడ, కొత్తపోలవరం, రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాల్లో మత్స్యకార యువకులు కూడా సెలవు దినాల్లో వచ్చి నేర్చుకుంటున్నట్లు చినబాబు తెలిపారు. ప్రతి ఆదివారమూ సహ ఉద్యోగులైన రెడ్డి రామచరణ్, కూసా వీర్రాజులు, యలమంచిలి నుండి నగిరెడ్డి రమేష్‌లు వచ్చి విద్యార్థులకు మరిన్ని మెళకువలు నేర్చుకుంటున్నట్లు తెలిపారు. ఉన్న ఊరిని, కన్నతల్లిని వదిలి రెక్కలచ్చిన పక్షుల్లా వెళ్లిపోతున్న నేటి తరానికి భిన్నంగా ఉన్న ఊరిలోని యువత ఉపాధి కోసం పాటు పడుతున్న చినబాబు అభినందనీయుడు.



తైక్వాండోలో శిక్షణ పొందుతున్న వారితో చినబాబు



తైక్వాండో శిక్షణ అందిస్తున్న చినబాబు

ఉపాధికి శిక్షణ

గ్రామంలో తైక్వాండోకు పునాది వేసి, బ్లాక్ బెల్ట్ సాధించేలా చేసిన యలమంచిలి గురువు నగిరెడ్డి సత్యనారాయణ. ఆయన శిక్షణలో తనను మరింత రాటుదేలేలా చేసి, క్రీడా విభాగంలో ఉద్యోగం సంపాదించేందుకు దోహదపడ్డారు. తనలాగే గ్రామంలో యువత కూడా ఉద్యోగం వచ్చేలా చేయడానికి తనవంతు కృషి చేస్తున్నాను.




- పినపాత్రుని చినబాబు
కానిస్టేబుల్, యలమంచిలి స్టేషన్

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సినిమా ప్రదర్శనలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా అనుబంధంగా పనిచేస్తున్న వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెలలో 3 సినిమాలను 6, 20, 27 తేదీలలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శిస్తున్నట్లు ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మూడు రోజుల్లో సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించనున్న చిత్రాలను ఎటువంటి ప్రవేశ రుసుం లేకుండా ఉచితంగా నగర ప్రజలు తిలకించవచ్చన్నారు. 6న (శనివారం) 2018 సంవత్సరానికి గాను ఆస్కార్ నామినేషన్‌లలో చోటు దక్కించుకున్న హిందీ చిత్రం "న్యూటన్" ప్రదర్శన ఉంటుందన్నారు. 20 న (శనివారం) తొలి హిందీ సినిమాకు మొదటి సూపర్ స్టార్‌గా ఎదిగి గుర్తింపు పొందిన గాయకుడు, నటుడు కెఎల్ సైగల్ 71వ వర్థంతిని పురస్కరించుకుని, ఆయనకు నివాళి అర్పిస్తూ ఆయన నటించిన "షాజహాన్" హిందీ చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే 27న (శనివారం) హైదరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు, విశ్లేషకులు ఎస్‌వి రామారావు, మహానటులు ఎస్‌వి రంగారావు, రేలంగిలపై రూపొందించిన "డాక్యుమెంటరీలు" ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విరామారావు పాల్గంటారన్నారు. మరిన్ని వివరాలకు 9052954800 నెంబర్‌తో సంప్రదించాలన్నారు.





ఒక్క క్షణం కళ్లు మూసుకోండి.. అంతా శూన్యం.. చిమ్మ చీకటి, గాడాంధకారం. అడుగు ముందుకు పడదు. చేతులు పనిచేయవు. కేవలం ఒక్క క్షణానికే ఇన్ని అవస్థలు పడితే జీవితమంతా అంధకారంలో జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో.. ఆలోచిస్తేనే ఆందోళన, కలవరం పుడుతోంది కదా.. అంధత్వంతో పుట్టామనే వేదన చిన్నారుల జీవితాన్ని దుర్భరంగా మారుస్తుంది. ఇటువంటి బాలికలను ఆదరించి, అక్కున చేర్చుకుని, ఆత్మ విశ్వాసం పెంచుతోంది నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో సాగర్‌నగర్ ప్రాంతంలో జాతీయ రహదారిని ఆనుకుని "డగ్లస్ స్మారక అంధుల పాఠశాల"..

కారుచీకట్లో.. కాంతిరేఖ

- అంధ బాలికల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్న పాఠశాల
- నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి



పాఠశాల బాలికలతో సంభాషిస్తున్న మంత్రి గంటా (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-కలెక్టరేట్

తమకున్న వైకల్యాన్ని అక్కడి చిన్నారులు అవరోధంగా భావించరు.. ప్రపంచాన్ని చూడలేమని కుమిలిపోరు. చూపు లేకపోయినా ఎన్నో విజయాలు సాధిస్తూ ఎందరికో ఆ బాలికలు ప్రేరణగా నిలుస్తారు. ఆటపాటల్లోనూ, ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడంలోనూ అలవోకగా విజయాలు సాధిస్తున్న తీరు పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. వారే డగ్లస్ స్మారక అంధుల పాఠశాల విద్యార్థులు. నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

ఇక్కడుండే 70 మంది విద్యార్థులకు నిర్వాహకులు భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తున్నారు. 15 ఏళ్ల లోపు వారిని ఇక్కడ చేర్చుకుని 5వ తరగతి వరకు చదువు నేర్పి ఆపై చదువుకు హైదరాబాద్ సమీపంలోని నర్సాపురం పంపిస్తారు. అక్కడ 10వ తరగతి వరకు బ్రెయిలీ లిపిలో విద్య నేర్పుతారు. తర్వాత అందరిలాగే పుస్తకాలు చదివించుకుని అర్థం చేసుకుంటూ ఉన్నత విద్య కొనసాగిస్తారు. టీవీ, కంప్యూటర్ సాయంతో కూడా అధ్యయనం కొనసాగిస్తూ, సహాయకుని సహకారంతో పరీక్షలు రాస్తారు. లెక్కలు మాత్రం "ట్రైలర్స్ ఫ్రేమ్" తో చేస్తారు. నడకకు వీరు మొబైల్ స్టిక్ వాడతారు. డగ్లస్ పాఠశాల విద్యార్థులు చదువులోనే కాక, సాంస్కృతిక, క్రీడా రంగాలలో కూడా ముందున్నారనడానికి పలు వికలాంగుల పోటీల్లో పాల్గని బహుమతులు పొందుతుండటమే తార్కాణం.



మార్షల్ ఆర్ట్స్‌లో చిన్నారులకు శిక్షణ

కేవలం అంధ బాలికల కోసం ప్రత్యేకంగా ఈ పాఠశాలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇదొక్కటే అంధ బాలికల కోసం నడుస్తున్న ఏకైక ఆశ్రమ పాఠశాల. 1987లో మొదటిసారిగా 1 నుంచి 6వ తరగతి వరకు పాఠశాల ప్రారంభించారు. 1992లో 10వ తరగతి వరకు స్థాయిని పెంచారు. నాటి నుంచి నేటి వరకు 66 మందికి పైగా బాలికలు 10వ తరగతి ఉత్తీర్ణతను ఈ పాఠశాల విద్యార్థులు సాధించారు. ఈ పాఠశాలలో అంధ బాలికలు ఎవరైనా చేరాలనుకుంటే చేరాల్సిన వారికి ప్రభుత్వ వైద్యాధికారిచే 40 శాతం పైబడి అంధత్వం ఉన్నట్లు జారీ చేసిన ధ్రువపత్రాన్ని సమర్పించాలని ప్రిన్సిపల్ ఎం మహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రస్తుం 70 మంది అంధ బాలికలు ఇక్కడ చదువుతున్నారన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపల్ 9000013636 నెంబర్‌తో సంప్రదించవచ్చన్నారు.

వెలుగు కిరణాలు

నగరంలోని బాలికల అంధ పాఠశాలలో చదువుకుని గ్రూపు – 1లో ఎంపికైన ఎ రాణి డిప్యూటీ లేబర్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. పి హైమావతి ఆలయ కార్యనిర్వహణాధికారిగా, కె మల్లేశ్వరి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ వారి ప్రతిభను చాటుకున్నారు. నగరానికి చెందిన కె లక్ష్మీ నార్సాక్షీణమ్మ బ్రెయిలీలో రచనకు ఉపక్రమించి విజయం సాధించింది. బివికె కాలేజిలో చదివి ప్రస్తుతం మహారాణి పేటలోని రాణి చంద్రమతిదేవి (ఆర్‌సిడి) హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. వీరంతా ఈ పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఎందరో అంధబాలికలకు మార్గదర్శకంగా నిలిచారు.




వసతులను పరిశీలిస్తున్న మంత్రి గంటా



అంధ బాలికల గేయాలాపన

అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ



జనవరి 4.. ఇది అక్షరాస్యులైన అంధులు ఆజన్మాంతం రుణపడాల్సిన ఒక "లిపి బ్రహ్మ" జన్మించిన రోజు. చూపు లేని వారు చదవగలిగేలా అక్షరాలు రూపొందించి, అంధ జగత్తులో అక్షర జ్యోతులు వెలిగించిన ఆ మహనీయుడు "లూయిస్ బ్రెయిలీ" అతని పేరిట ప్రఖ్యాత మైనదే "బ్రెయిలీ లిపి". పారిస్ నగరానికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న "కూప్‌రే" గ్రామం బ్రెయిలీ జన్మస్థలం. 1809లో పుట్టిన అతను జన్మత: అంధుడు కాదు. అతని తండ్రి చర్మకారుడు. గుర్రపు జీను తయారు చేయడానికి సిద్ధంగా అతను ఉంచిన పనిముట్టుతో నాలుగేళ్ల వయస్సున్న బ్రెయిలీ ఆడుకుంటూ ఉండగా పనిముట్టుకు ఉన్న మేకు కంటికి గుచ్చుకుని కంటిని కోల్పోయాడు. అటు తర్వాత వైద్యం సరిగా అందకపోవడంతో మొదటి కంటి ప్రభావంతో రెండో కన్ను కూడా దెబ్బతిని ఆరేళ్ల వయస్సులోనే ఆయన పూర్తి అంధుడయ్యాడు. అయినప్పటికీ బ్రెయిలీ తల్లిదండ్రులు అధైర్యపడక అతనిని ప్యారిస్‌లోని "వాలంటాన్ హునే" అంధుల పాఠశాలలో చేర్పించారు. అంధుల పాఠశాలలో చేరడానికి ముందు ఇంటి వద్ద తన తండ్రి తయారు చేసిన శిలాక్షరాలను చేతితో తాకి ఇంటి వద్దనే విద్య నేర్చుకోవడం ఆరంభించారు. అంధుల పాఠశాలలో విద్యను ఎంతో పట్టుదలగా నేర్చుకుని ఉత్తీర్ణుడై అదే పాఠశాలలో అధ్యాపకునిగా చేరాడు.

లిపి తయారీకి కృషి

ఉపాధ్యాయునిగా ఉన్న సమయంలో అంధుల కోసం ప్రత్యేకంగా ఒక లిపి తయారు చేయాలన్న కాంక్ష తీవ్రమైంది. అయితే అప్పటికే వాలంటీస్ హావే, చార్లెస్ బార్బియర్ అనే వ్యక్తులు చూపులేని వారి కోసం రెండు రకాల రాత పద్ధతులు కనిపెట్టారు. అంతకన్నా సులభ శైలిలో, బార్బియర్ రాత విధానం ఆధారంగా ఒక ప్రత్యేక లిపిని బ్రెయిలీ కనిపెట్టాలనుకున్నాడు. రెండు వరసలలో మొత్తం 6 చుక్కలు ఉండేలా తొలుత ఫ్రెంచి భాషలో తయారైన లిపిలో ముందు 10, తర్వాత మరో 30 అక్షరాలు చేరి "బ్రెయిలీ లిపి"గా రూపొందింది. తర్వాత ఆంగ్లం, ఇతర ప్రపంచ భాషలలోకి ఈ పద్ధతి ప్రవేశపెట్టడంతో దృష్టి కోల్పోయిన వారికిదో అద్భుత సృష్టిగా నిలిచింది. ప్రత్యేకమైన పలకపై దళసరి కాగితం ఉంచి "గైడ్" పరికరంపై 'స్టైయిలస్" సూదితో రంధ్రం చేస్తూ రాయడం.. ఈ లిపిలో అనుసరించాల్సిన రాత పద్ధతి. కుడి నుంచి ఎడమకు రాసిన కాగితాన్ని వెనక్కు తిప్పి ఉంచిన అక్షరాకృతులను వేళ్లతో తడిమి చదువుతారు. దీన్ని తెలుగులో కూడా ప్రవేశపెట్టారు. ఎందరో అంధులకు అక్షర సౌందర్యాన్ని సాక్షాత్కరింపజేసిన బ్రెయిలీ 1852లో క్షయ వ్యాధితో మరణించాడు. 1952లో ఆయన అవశేషాలను తవ్వితీసిన ఫ్రెంచి ప్రభుత్వం రాజ మర్యాదలతో పునస్సమాధి చేసి బ్రెయిలీపట్ల భక్తి గౌరవాలను చాటుకుంది. అంధత్వం శాపం కాదని, ఆత్మ స్థయిర్యముంటే అంతా జ్యోతిర్మయమేనని భావించి, భాసించిన వారిలో మూగ, చెవిటి అయిన అంధురాలు, ప్రముఖ కవయిత్రి హెలెన్ కెల్లర్, రచిత సూరదాస్, విశ్వవిఖ్యాత రచయిత జార్జ్ బెర్నార్డ్‌షా వంటి వారెందరో ఉన్నారు. వీరందరూ అంగవైకల్యులే అయినప్పటికే ఎందరికో స్ఫూర్తిప్రదాతలుగా నిలిచారు.

పేదలకు ఉపయోగకరంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి

ప్రజాశక్తి-సీతమ్మధార

పేదలకు ఉపయోగకరంగా ఉండేలా సంక్షేమ పథకాలను తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెడుతుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి పేర్కొన్నారు. టిపిటి కాలనీలో బుధవారం జన్మభూమి-మావూరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడిచిన మూడున్నరేళ్లలో విశాఖపట్నం ఎంతో అభివృద్ధి సాధించిందని, రానున్న కాలంలో ప్రపంచ స్థాయిలో విశాఖను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సమస్యలేమైనా ఉంటే అధికారులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎపిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో 11, 12, 13, 14 వార్డుల మహిళలకు జాయింట్ కలెక్టర్ జి.సృజన, జోనల్ కమిషనర్ నల్లనయ్య, అదనపు కమిషనర్ మూర్తి, తహశీల్దార్ నాగభూషణరావు, టిడిపి నాయకులు, వార్డు అధ్యక్షులు, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.


జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి తదితరులు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార

అనారోగ్యంతో బాధపతున్నవారికి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్కులను ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బుధవారం పంపిణీ చేశారు. 32వ వార్డుకి చెందిన రాపేటి యమునకు రూ.4 లక్షలు, 14వ వార్డుకు చెందిన ఈశ్వరమ్మకు రూ.40 వేలు చెక్కులను అందజేశారు. ఉత్తర నియోజకవర్గంలో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు.

5న మ్యాక్స్ ఫ్యాషన్ షోరూం ప్రారంభం

కలెక్టరేట్ : భారతదేశపు అతిపెద్ద కుటుంబ ఫ్యాషన్ గమ్యస్థానం మ్యాక్స్ ఫ్యాషన్ తమ 3వ షోరూమ్‌ను శుక్రవారం నగరంలోని విఐపి రోడ్డులో ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి తెలిపారు. 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న నూతన షోరూం తమ ఖాతాదారులకు అంతర్జాతీయ షాపింగ్ అనుభూతిని కలిగిస్తుందని పేర్కొన్నారు. పురుషులకు, మహిళలకు, పిల్లలకు అనువైన దుస్తులు, పాద రక్షలు అన్నీ ఒకే చోట లభిస్తాయని వివరించారు. శీతాకాలం వింటర్ కలెక్షన్స్ కూడా మ్యాక్స్‌లో ఏర్పాటుచేసినట్టు చెప్పారు. నగర సంస్కృతికి, యువతరాన్ని ఆకర్షించే విధంగా చక్కగా రూపొందించామన్నారు. రూ.599 ధరలో 3,000కు పైగా ఉత్తమ అంతర్జాతీయ స్టయిల్స్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

ప్రొఫెసర్ సాయిబాబాను విడుదల చేయాలి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి నగర ప్రముఖుల లేఖ

కలెక్టరేట్ : ప్రొఫెసర్ సాయిబాబాను జైలు నుంచి విడుదల చేయాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు లేఖ రాసినట్లు పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి తెలిపారు. ఢిల్లీలోని రామ్‌లాల్ ఆనంద్ కాలేజీ, యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జిఎన్.సాయిబాబాకు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సెషన్స్ కోర్టు గత ఏడాది మార్చి 7న జీవిత ఖైదు విధించిందని పేర్కొన్నారు. దేశంలోని ఆదివాసీలు, నిర్వాసితులు, పేద ప్రజలకోసం ఆయన ఉద్యమిస్తున్నారని, 90 శాతం అంగవైకల్యం కలిగిన ఆయనను జైలునుంచి విడుదల చేయాలని కోరారు. లేఖపై సంతకాలు చేసిన వారిలో ఎయు పూర్వపు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కెవి రమణ, ప్రొఫెసర్ సూరప్పుడు, ప్రొఫెసర్ మంజులత, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మహిళా చేతన కార్యదర్శి కె.పద్మ, సిపిఐ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు, ఒపిడిఆర్ కార్యదర్శి సి.భాస్కరరావు తదితరులు ఉన్నారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి తీర్మానం 70/175 ప్రకారం అంగవైకల్యం కలిగిన ఖైదీల విడుదలకు అవకాశముందని, దీనిని గమనంలోకి తీసుకుని నాగపూర్ జైలులో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబాను విడుదల చేయాలని విజ్ఞప్తిచేశారు.

సిసి కెమెరాల ఆవశ్యకతపై అవగాహన

ఉక్కునగరం : భద్రతా పరమైన కారణాల దృష్ట్యా ఉక్కునగరంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలు అమర్చాలని స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ ఎం.రాధాకృష్ణ సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్టీల్‌ప్లాంట్ దేవాలయాలు, చర్చిలు, మసీదుల ప్రతినిధులకు సిసి కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ఎలాంటి నేరాలకు అస్కారం ఇవ్వకుండా ఉండాలంటే సిసి కెమెరాలను ప్రతి చోటా అమర్చుకోవాలని కోరారు. నేరం జరిగితే సిసి కెమెరాల ద్వారా నిందితులను సాధ్యమైనంత త్వరగా గుర్తించవచ్చున్నారు. ఈ సమావేశంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాధాకృష్ణ


బోరును ప్రారంభిస్తున్న గంకల అప్పారావు

37వ వార్డులో ఇంటింటికీ తెలుగుదేశం

ప్రజాశక్తి-కంచరపాలెం

జివిఎంసి 37వ వార్డు పరిధి ఇందిరానగర్‌లో బుధవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు టిడిపి అధ్యక్షులు గంకల అప్పారావు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. గతంలో నిర్వహించిన పర్యటనలో గ్రామంలో బోరు లేక ఇబ్బందిపడుతున్నట్లు తెలిసి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుతో మాట్లాడి బోర్లు మంజూరుచేయించినట్లు అప్పారావు చెప్పారు. వార్డులో మూడు బోర్లు ఏర్పాటుచేశారు. ఈ బోర్లను బుధవారం గంకల అప్పారావు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా కార్యదర్శి అవలనారాయణ స్వామి, రొంగలి మహేశ్వరరావు, కడగాలి స్వామి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కంచరపాలెం

జివిఎంసి 37వ వార్డు పరిధి పెద్ద కొత్తూరులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని వార్డు టిడిపి అధ్యక్షుడు గంకల అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి అవల నారాయణస్వామి, జివిఎంసి అధికారులు, జన్మభూమి సభ్యులు, టిడిపి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గ్యార్వి షరీఫ్ ఉర్స్ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి-కంచరపాలెం

జివిఎంసి 40వ వార్డు పరిధి డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్ -ఈ -అల్ ఖదీర్ ఆధ్వర్యాన ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న గ్యార్వి షరీఫ్ ఉర్స్ ఉత్సవాలకు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌కు మస్జిద్ కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానపత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి 40వ వార్డు అధ్యక్షులు కాళ్ళ ఆదిబాబు, గ్యార్వి షరీఫ్ ఉర్స్ కమిటీ అధ్యక్షులు షేక్ నూరి, మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఉస్మాన్ అలీ, ఉపాధ్యక్షులు ఎమ్డీ సర్వర్, కార్యదర్శి అన్సర్ వలీ, మున్నా, భాషా తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యేకు ఆహ్వానాన్ని అందిస్తున్న ముస్లిం ప్రతినిధులు

డిసిఐని ప్రయివేటీకరించొద్దని పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-పెందుర్తి

డిసిఐని ప్రయివేటీకరించొద్దని సిఐటియు ఆధ్వర్యాన పాపయ్యరాజుపాలెం, శివగాయత్రినగర్, ఎన్ఎడి కాలనీలో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జి.అప్పలరాజు మాట్లాడుతూ, అధిక లాభాలతో నడుస్తున్న డిసిఐని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎందుకు ప్రయివేటీకరణ చేస్తుందని ప్రశ్నించారు. మోడీ వస్తే లక్షల్లో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని చెప్పారని, అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలను ఊడదీస్తున్నారని విమర్శించారు. లాభాల్లో ఉన్న సంస్థను ప్రయివేటీకరిస్తుంటే ఎంపీలు ఎందుకు నిలదీయడంలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రజని, కె.అప్పలనాయుడు, భారతి, రామలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

చంద్రన్న కానుకల పంపిణీ

ప్రజాశక్తి-పెదగంట్యాడ

జివిఎంసి 52వ వార్డు పరిధి నడుపూరులో బుధవారం చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ, పండగను పేదలందరూ సంతోషంగా చేసుకునేందుకు చంద్రబాబు చంద్రబాబు చంద్రన్న కానుకలను ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొశెట్టి అప్పారావు, శివ, జిత్తిక రాజు, సత్యారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి

సంక్రాంతి ఆటల పోటీలు

ప్రజాశక్తి-పెందుర్తి

జివిఎంసి 70వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెంలో మహిళా సంఘాల ఆధ్వర్యాన ముగ్గులు, కుర్చీలు, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నగర ఉపాధ్యక్షులు బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ, ఆటల వల్ల మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలు దూరమవుతున్నాయన్నారు. ఐక్యంగా ఉంటే సమస్యలు పరిష్కరించుకోగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంటి పని వార్ల సంఘం ప్రెసిడెంట్ రజని, ప్రసన్న, విజయ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువకావాలి

- రాష్ట్ర మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు - రెండో రోజుకు 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-గోపాలపట్నం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందాలన్నదే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని జివిఎంసి 67వ వార్డు బాజీజంక్షన్ సంత ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ లోటు బడ్జెట్‌లోను ప్రభుత్వం సంక్షేమ పథకాలకు రూ.96 వేల కోట్లు ఖర్చు పెట్టిందని చెప్పారు. ఒకేసారి పేద ప్రజలకు 56వేల ఇళ్ల పట్టాలను మంజూరు చేసిన ఘనత తెలుగుదశం ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 130 పథకాలను ప్రజలకు అందిస్తున్నాయన్నారు. అయితే వాటి గురించి ప్రజలకు ఇంకా పూర్తిగ అవగాహన ఉండట్లేదని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేడం కోసం, ప్రజలతో మమేకం కావటానికి జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. రాష్ట్రంలో 46వేల మందికి ఫించన్లు అందిస్తున్నామని ఈ జన్మభూమిలో మరో 5 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఒంటరిగా భర్త వదిలేసిన మహిళకు ఫింఛన్లు, కిడ్నీ బాధితులకు పింఛన్లు, ఇలా ప్రతి ఒక్కరినీ ఆదుకోవటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఒక పక్క అభివృద్ధి మరో పక్క సంక్షేమం జరుగుతుంటే ప్రతిపక్ష నేతకు అవి కన్పించడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఒక్క పింఛను ఇవ్వలేదని జగన్ పాదయాత్రలో ప్రజలకు చెప్పడం సిగ్గుచేటు కాదా అని ప్రశ్నించారు. చంద్రన్న బీమా దేశంలోనే ఓ మంచి పథకమని చెప్పారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు, వుడా విసి బసంత్‌కుమార్‌లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వర్మ, జోన్‌సిక్స్ ఇన్‌చార్జి కమిషనర్ సిహెచ్ సత్యనారాయణ, ఎంఎంహెఒ జ్యోతి, అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మల్కాపురం : జన్మభూమి కార్యక్రమం బుధవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ మేరకు జివిఎంసి 46వ వార్డు పరిధి పిలకవానిపాలెంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చంద్రన్న బీమా బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా వెంకటరావు, సిఒ తులసి, టిడిపి నాయకులు శీరం పైడిరాజు, కోరాడ శ్రీనివాసరావు, బర్రి సూర్యప్రకాష్, కొత్తపల్లి ప్రభావతి, బీమామిత్రలు పాల్గొన్నారు.

జివిఎంసి 48వ వార్డు ఇందిరా కాలనీలో గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో కొరిబిల్లి రాము, జయశంకర్, వి డేవిడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

జివిఎంసి 47వ వార్డు ములగాడ హౌసింగ్‌బోర్డు కాలనీలో వార్డు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు వంశీకిషోర్‌యాదవ్, రేవల సత్యనారాయణ ఆధ్వర్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ సంజీవ్‌కుమార్, టిడిపి నేతలు పొట్టిమూర్తి, నక్కా లక్ష్మణరావు, అమరావతి, పూడి భాస్కరరావు, మంజు పాల్గొన్నారు.

విసుగు పుట్టించిన చంద్రబాబు ప్రసంగం

గోపాలపట్నం : జన్మభూమి కార్యక్రమంలో భాగంగా బాజీ జంక్షన్ వద్ద జరుగుతున్న జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో సిఎం ప్రసంగం టివి ద్వారా ప్రసారం చేశారు. అధికారులు ప్రజాప్రతినిదులు సిఎం ప్రసంగం వినటానికి శ్రద్ధగా ఉండగా, ప్రజలు మాత్రం సిఎం ప్రసంగం వినకుండా కూర్చున్న కుర్చీల్లోంచి నుంచి లేచి నిలబడి కబుర్లు చెప్పుకోవడం ప్రారంభించారు. ఇంకా చంద్రబాబు ప్రసంగం పూర్తికాకపోవడంతో కొంతమంది సభ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. మరికొంత మంది అసహనం వ్యక్తం చేశారు. సిఎం ప్రసంగం పూర్తి కాగానే ఎక్కడివారు అక్కడ కూర్చున్నారు. మంత్రి చింతకాయల సిఎం స్పీచ్ విని వేరే కార్యక్రమానికి వెళ్లాలని సభ నుంచి నిష్క్రమించారు.



దుర్గానగర్‌లో సావిత్రిభాయి పూలే జయంతి వేడుక

సావిత్రిబాయి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-మల్కాపురం

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు విద్యార్థులంతా కృషి చేయాలని ప్రతిభ స్కూల్ ప్రిన్సిపల్ తోనంగి వెంకటరమణి అన్నారు. ఈ మేరకు జివిఎంసి 47వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ప్రతిభ హైస్కూల్‌లో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. భారతదేశంలో మహిళా విద్యకు ఆద్యురాలిగా సావిత్రిబాయి పూలే నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

49వ వార్డులో..

జివిఎంసి 49వ వార్డు పరిధి మల్కాపురం దుర్గానగర్ జివిఎంసి పాఠశాలలో వార్డు టిడిపి ఉపాధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యాన సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్ల నానాజీ, పోతాబత్తుల శ్రీనువాస్, పాఠశాల హెచ్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్కాపురం : ఆర్‌కెపురం యారాడ పార్కు వద్ద ప్రధాన రహదారి పక్కన మంగళవారం అపస్మారక స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని పోలీసులు కెజిహెచ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఆయన బిచ్చగాడనీ, కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని మల్కాపురం పోలీసులు తెలిపారు. మృతదేహం కెజిహెచ్ శవాగారంలో భద్రపరిచామని పోలీసులు పేర్కొన్నారు.

5న సిల్వర్ షీల్డ్ వేడుక

మల్కాపురం : షిప్‌యార్డులో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన సిల్వర్ షీల్డ్‌ను(2015 జులై నుంచి 2017 మే వరకు) జనవరి 5వ తేదీన హంసధ్వని ఆడిటోరియంలో ఇవ్వనున్నారు. ఈ మేరకు హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేత తాతారావు బుధవారం ప్రకటన విడుదల చేశారు.

చంద్రన్న కానుకల పంపిణీ

మల్కాపురం : జివిఎంసి 46వ వార్డు పరిధి పిలకవానిపాలెం 291 రేషన్ డిపోలో వార్డు టిడిపి నాయకుడు శీరం పైడిరాజు ఆధ్వర్యంలో బుధవారం చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ టిడిపిప్రభుత్వ హయాంలోనే ప్రజలకు సంక్షేమం పూర్తిగా అమలవుతోందన్నారు. క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి పండగలను పేదలంతా సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చంద్రన్న సంక్రాంతి కానుకలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బర్రి సూర్యప్రకాష్, కొత్తపల్లి ప్రభావతి, రేషన్ డీలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు సదరన్ క్యాంపు

కంచరపాలెం : వికలాంగులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి గణబాబు అన్నారు. ఈ మేరకు జివిఎంసి 36వ వార్డు పరిధి రామ్మూర్తి పంతులు పేట రైల్వే గేటు వద్ద ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైకల్య ధ్రువీకరణ పత్రాలనిచ్చే సదరన్ క్యాంపును ఆయన ప్రారంభించారు ఈ కార్యక్రమంలో 43వ వార్డు టిడిపి అధ్యక్షుడు శరగడం రాజశేఖర్, సూరిశెట్టి నాగు, రంజిత్‌కుమార్, పెంటకోట ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో ఐద్వా నాయకులు

గోపాలపట్నం : వరకట్న వేదింపుల బారిన పడుతున్న మహిళలకు రక్షణగా నిలిచే సెక్షన్ (498ఎ)ను సవరించవద్దని కోరుతూ, ఐద్వా గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్ విజయలక్ష్మీ ఆధ్వర్యాన స్థానిక బుధవారం సంత ప్రాంగణంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు బి రమణి మాట్లాడుతూ స్త్రీలకు ఎంతో రక్షణ కవచంగా ఉన్నటువంటి 498ఎను సవరించడం అంటే సెక్షన్‌ను నిర్వీర్యం చేయడమేనని చెప్పారు. ఈ నాటికి మహిళలపై జరుగుతున్న నేరాల్లో 60 శాతం వరకట్న వేదింపులేనని ప్రభుత్వ లెక్కలు చెపుతున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో చట్టాన్ని పటిష్టంగా అమలుచేయలే తప్పా, దుర్వినియోగం అవుతుందనే పేరుతో సుదీర్ఘకాలం మహిళలు పోరాడి సాదించుకున్న 498ఎను నీరుగార్చే యత్నం చేయరాదని అన్నారు. ఇదే సమస్యపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తుందని, చివరిగా జనవరి 3వ వారంలో కేసు విచారణకు వస్తుందని, అందుకే మహిళలతో పాటు వారి సంక్షేమం కోరే ప్రతి ఒక్కరు 498ఎ లో ఎటువంటి సవరణ చేయకుండా యథాతథంగా అమలు చేయాలని సంతకాల సేకరణ చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా డివిజన్ కమిటీ సహాయ కార్యదర్శి పి.ముత్యాలమ్మ, ఎస్.మహేశ్వరి, సభ్యులు ఎస్ లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు ర్యాలీ

గోపాలపట్నం : ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం అందరి బాధ్యతని సిఐటియు గోపాలపట్నం డివిజన్ కమిటి కార్యదర్శి బలివాడ వెంకటరావు అన్నారు. డిసిఐను ప్రైవేటికరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి 68వ వార్డు పరిధి అజంతాపార్కు, శ్రీనుబాబునగర్, టైలర్స్ కాలనీ, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాల బాటలో పయనిస్తున్న డిసిఐను ఎందుకు ప్రైవేటీకరించాలనుకుంటున్నారో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం ఒక్క బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. ప్రజా బ్యాలెట్ ద్వారా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తప్పని నిరూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గోపాలపట్నం డివిజన్ కమిటీ అధ్యక్షుడు డి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు పి సత్యనారాయణ, ఎఎస్ గోవింద్, సంయుక్త కార్యదర్శి అనసూయ, సభ్యులు వైడి అప్పారావు, ఎం అప్పారావు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు



రిఫరీలుగా ఎంపికైన రామారావు, హరి

బాక్సింగ్ పోటీల రిఫరీలుగా ఎంపిక

మల్కాపురం : ఈ నెల 5, 6, 7 తేదీలలో పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ మెన్ బాక్సింగ్ పోటీలకు రిఫరీలుగా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన జి రామారావు, వి హరిలను ఎంపిక చేస్తూ ఇండియన్ ఎమెచ్యూర్ బాక్సింగ్ ఫెడరేషన్ ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు బుధవారం వారికి స్పాన్సర్ చేస్తున్న పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్‌ట్రస్టు చైర్మన్ పివి సురేష్ ఎంపికైన యువకులను అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు రిఫరీలుగా పారిశ్రామిక ప్రాంత వాసులు ఎంపిక కావడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. క్రీడల్లో రాణిస్తున్న వారికి ట్రస్టు తరుపున అవసరమైన సాయాన్ని అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత అవసరం

గోపాలపట్నం : పరిశుభ్రతకు అందరు ప్రాధన్యతను ఇవ్వాలని, రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత నందవరపు సోములు అన్నారు. జివిఎంసి 66వ వార్డు జనతాకాలనీలో పిచ్చిమొక్కలు చెత్తను ప్రొక్లెయినర్‌తో బుధవారం శుభ్రపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనతా కాలనీ వద్ద సుమారు 200 అడుగుల వెడల్పు గల గెడ్డ ఉండేదని, అది ఆక్రమణలకు గురికావడంతో మురికినీరు పోయే గెడ్డ బాగగా కుచించుకుపోయిందని అన్నారు. ప్రస్తుతం వాడుకునీరు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్పా శాశ్వత పరిష్కారం లేదని చెప్పారు. దోమలు వృద్ధి చెందకుండా ఎక్కడ చెత్తను అక్కడ వెంటనే తొలగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత మొజ్జాడ విమల, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన మూగ బాలికపై అత్యాచారం హేయం

దువ్వాడ సెజ్ గేటు వద్ద ప్రజా సంఘాల ఆందోళన
నిందితున్ని కఠినంగా శిక్షించాలి
బాధితురాలికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియో, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - కూర్మన్నపాలెం

దువ్వాడ సెజ్‌లో అత్యంత అమానవీయంగా గిరిజన మూగ బాలికపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ సెజ్ గేటు వద్ద వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి), గిరిజన సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు మాట్లాడుతూ సెజ్‌లో హెచ్‌బిఎల్ కంపెనీలో పని చేస్తున్న బాలికపై అదే కంపెనీ బస్సు డ్రైవర్ వాహనంలోనే అత్యాచారం చేసి దారుణంగా హింసించాడన్నారు. ఈ ఘటన గురించి సెజ్ యాజమాన్యానికీ, సెక్యూరిటీ సిబ్బందికీ తెలిసినా కప్పిపుచ్చేందుకు పూనుకోవడం దారుణమన్నారు. రూ.లక్ష ఇచ్చేసి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, కేసును పక్కదారి పట్టించేందుకు కంపెనీ యాజమాన్యం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ అమానవీయ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు పృధ్వీరాజ్, వరలక్ష్మి మాట్లాడుతూ అత్యాచార నిందితునిపై నిర్భయ, వికలాంగుల చట్టం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇల్లు, భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియోను ప్రకటించాలని కోరారు. ఐద్వా నగర నాయకులు వేణు, ఎంబి.సత్యవతి, మంగవేణి మాట్లాడుతూ సెజ్‌లోని సిసి పుటేజీలను పోలీసులు తక్షణమే స్వాధీనం చేసుకుని విచారణను వేగవంతం చేయాలన్నారు. రోజురోజుకూ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు క్షీణించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని, మద్యాన్ని నియంత్రించాల్సి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. సెజ్‌ల్లో ఎటువంటి కార్మిక చట్టాలూ అమలుకాకపోవడం, భద్రతా చర్యలు కానరాకపోవడం వల్లే తరుచూ ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. అత్యాచార ఘటనను నిరసిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు జరిగే ఆందోళన కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) జిల్లా కార్యదర్శి బుగిడి నూకప్పారావు, నగర అధ్యక్షులు పాల వెంకయ్య, రాజు, జీవన కుమారి, లక్ష్మి, ఆనంద్, గిరిజన సంఘం నాయకులు కోటిబాబు, ఐద్వా స్టీల్, గాజువాక జోన్ల నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న దళిత, మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు

పలువురి మద్దతు

ప్రజా సంఘాల ఆందోళనకు మాజీ గిరిజన శాఖ మంత్రి పసుపులేటి బాలరాజు, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు సివేరి సోమ, ఐఎన్‌టియుసి స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ తదితరులు మద్దతు తెలిపారు. బాలికకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు.

డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యాన ధర్నా

దళిత హక్కుల పోరాట సమితి, ఎన్‌ఎఫ్‌ఐ, డబ్ల్యుఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని అంబేద్కర్ విగ్రహం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిహెచ్‌పిఎస్ కార్యదర్శి బి.వెంకటరావు మాట్లాడుతూ, బాలికపై అత్యాచారానికి తెగబడిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి మహిళా సమాఖ్య నగర గౌరవాధ్యక్షులు బూసీ పరమేశ్వరీ, చింతయ్య, పుల్జాన్ టోప్పో, సాంబారి దుర్గ, తుపాన్ కుమార్, బి.విజయలక్ష్మి, కేల్మ, ఎన్.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.


రమణికి వినతిపత్రం ఇస్తున్న ఎఐటియుసి నాయకులు

ఇన్సెంటివ్ చెల్లించాలని ఎఐటియుసి ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం

స్టీల్ మెల్ట్‌షాప్(ఎస్ఎంఎస్) ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఇన్సెంటివ్‌ను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యాన ఎస్ఎంఎస్ ఏరియా షాప్ ఆఫీస్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వర్క్స్) ఒఆర్.రమణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్టీల్ ఎఐటియుసి అధ్యక్షుడు జి.బోసుబాబు మాట్లాడుతూ, రెండు నెలలుగా యాజమాన్యం ఇచ్చిన టార్గెట్స్‌ను అధిగమించి రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేపడుతున్న ఉద్యోగులకు ఇన్సెంటివ్ చెల్లించకపోవడం దారుణమన్నారు. యాజమాన్యం ఇదే వైఖరిని అవలంభిస్తే దాని ప్రభావం ఉత్పత్తిపై పడుతుందన్నారు. కెఎస్ఎన్.రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జి.సోమన్న, ఎ.మసేన్‌రావు, రంగప్రసాద్, కోటేశ్వరరావు, కె.రాజబాబు, జగదీశ్, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిసి రుణాలు అందజేత

కూర్మన్నపాలెం: జివిఎంసి 58వ వార్డు పరిధి ఎన్‌టిఆర్.కాలనీకి చెందిన రజకులకు బిసి కార్పొరేషన్ రుణాలు రూ.7,50,000 మంజూరయ్యాయి. ఈ మేరకు రుణాల చెక్కులను వార్డు మాజీ కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.


బిసి రుణాల చెక్కులను అందిస్తున్న లేళ్ల కోటేశ్వరరావు

యువజనోత్సవాలలో టిఎస్‌ఆర్, టిబికె ప్రతిభ

ప్రజాశక్తి-గాజువాక

ఆంధ్రాయూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం యువజనోత్సవాల్లో టిఎస్‌ఆర్, టిబికె విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తెలిపారు. బృందనాట్యం విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, యూనివర్సిటీ స్థాయిలో తృతీయ స్థానం పొందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఆయన అభినందిస్తూ మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు మానసిక వికాసానికి అవసరమైన ఆటపాటలు, సమాజ సేవను అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.విష్ణువర్ధనరావు, వైస్ ప్రిన్సిపల్ విడిఎన్.సుభాషిణి, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి బి.సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకటనలో స్పష్టత కరువు

గాజువాక : హౌస్ కమిటీకి సంబంధించి ఎమ్మెల్యే జన్మభూమిలో చేసిన హౌస్ కమిటీ పరిష్కార ఘనత టిడిపిదే అని చేసిన ప్రకటన అవాస్తవమని గాజువాక గృహ యజమానుల సంక్షేమ సంఘం కార్యదర్శి కె.కిరీటం పేర్కొన్నారు. హౌస్ కమిటీకి సంబంధించి 8500 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 7వేల మందికి అర్హులుగా గుర్తించారని తెలిపారు. గుర్తించిన వారిలో 5,236 మందికి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అందులో 1500 పట్టాల్లో తప్పులుగా ఉన్నాయని, 2,500 పట్టాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 40 సంవత్సరాలుగా నివాసముంటున్న వారికి సర్వే చేయకుండా విడిచిపెట్టారని వివరించారు. ఇచ్చిన పట్టాల్లో కూడా షరతులు విధించడం వల్ల ఎందుకూ ఉపయోగం లేకుండా ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే చేసిన ప్రకటనకు, వాస్తవానికి పొంతన లేని విధంగా ఉందని పేర్కొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

గాజువాక : సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా నవ్య చేతన మహిళా సేవా సంఘం ప్రెసిడెంట్ అండిబోయిన లక్ష్మి ఆధ్వర్యాన అంగన్‌వాడీ పిల్లలకు బుధవారం భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ హేమలత, మాజీ కార్పొరేటర్ తిప్పల ఎమిలీజ్వాల, తిప్పల దేవన్ మాట్లాడుతూ, నిమ్న వర్గాల అభ్యున్నతికి సావిత్రీభాయి పూలే ఎంతో కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, వెంపాడ అప్పారావు, కిల్లాని ముసలయ్య, అండిబోయిన అప్పారావు, నెల్లి సాధూరావు తదితరులు పాల్గొన్నారు.



ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న అతిథులు

హౌస్ కమిటీ పట్టాల్లో షరతులను తొలగిస్తాం

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గాజువాక

గాజువాక హౌస్ కమిటీకి సంబంధించి 301 జిఒ కింద ఇచ్చిన పట్టాల్లో ఉన్న షరతులను త్వరలో తొలగిస్తామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెప్పారు. గాజువాక హైస్కూల్ రోడ్డులో బుధవారం జన్మభూమి-మావూరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజువాక నియోజకవర్గ పరిధిలో హౌసింగ్ కింద 5600 మంది దరఖాస్తు చేస్తే అందులో 3200 మందికి రుణాలు మంజూరుచేశామని తెలిపారు. త్వరలో ఆదర్శ గ్రౌండ్‌లో క్రీడామైదానం ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. తోపుడు బళ్ల వర్తకులందరూ వ్యాపారం చేసుకునేందుకు గాజువాక జోనల్ కార్యాలయం పక్కన ఖాళీ స్థలంలో షాపింగ్ మాల్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. గాజువాకలో పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద నియోజకవర్గానికి ఎక్కువ నిధులు తీసుకొచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ఇఇ నాగేశ్వరరావు, ఎఎంహెచ్ఒ డాక్టర్ జయరామ్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎఎస్ఒ భీమశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గత హామీలు అమలుకాకపోవడంపై నిలదీత

మూడేళ్లుగా నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంపై మాజీ కౌన్సిలర్ పల్లా చినతల్లి సభలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును నిలదీశారు. 64వ వార్డులో జన్మభూమి కమిటీల పెత్తనమే ఎక్కువైందని, అధికార టిడిపి వారికే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని విమర్శించారు. హౌస్ కమిటీ పట్టాల్లో అమ్ముకోడానికి కానీ, రుణాలు పొందడానికి కానీ వీలులేని విధంగా షరతులు పెట్టారని, దీని వల్ల పట్టాలు పొందిన వారు తీవ్ర అన్యాయానికి గురయ్యారని వివరించారు. ఇదే మీకు చివరి జన్మభూమి అని ఆమె అనడంతో అక్కడున్న తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళలు ఒక్కసారిగా చినతల్లిపై విరుచుకుపడ్డారు. దీంతో పెద్దఎత్తున వివాదం చోటుచేసుకుంది. పోలీసులు వచ్చి ఇరు గ్రూపులను శాంతింపచేసే ప్రయత్నం చేశారు. గొడవ పెద్దదయ్యే ప్రమాదముందని భావించిన ఎమ్మెల్యే ఇరు గ్రూపులను శాంతింపచేసేలా మాట్లాడారు. హౌస్ కమిటీ బాధితులకు న్యాయం చేస్తామని, జన్మభూమి కమిటీ సభ్యులతో సంబంధంలేకుండా అందరికీ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.


జన్మభూమిలో నిలదీస్తున్న పల్లా చినతల్లి తదితరులు

రసాభాసగా జన్మభూమి సభలు


జన్మభూమి సభలో టిడిపి, వైసిపి నేతల మాటల యుద్ధం

సమస్యలపై స్థానికుల నిలదీత
ఆగ్రహించిన తెలుగు తమ్ముళ్లు
టిడిపి -వైసిపి నాయకుల మధ్య వాగ్వివాదం
వైసిపి నేతలను నెట్టేసిన పోలీసులు
చెరువు, శ్మశానానికి పాసు పుస్తకాలు ఎలా ఇస్తారని
నిలదీసిన రైతులు

ప్రజాశక్తి-తగరపువలస

స్థానిక ఒకటోవార్డు బంగ్లామెట్టలో జివిఎంసి -భీమిలి జోన్ ఆధ్వర్యంలో బుధవారం జన్మభూమి మా వూరు గ్రామ సభ జరిగింది. సరిపడా తాగునీరు అందివ్వాలని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, రాములమ్మ థియేటర్ వద్ద నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులైన లబ్ధిదారులకు రాజీవ్ గృహ కల్పలో గృహాలు కేటాయించాలంటూ స్థానిక వైసిపి నాయకులు తమ్మిన కూర్మారావు, కుమిలి సూర్యనారాయణ అధికారుల వద్ద ప్రస్తావించారు. సరిపడా తాగునీరు అందివ్వడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యిందని ఆరోపించారు. ఇంతలో టిడిపి నాయకులు జోక్యం చేసుకుని కాంగ్రెస్ హయాంలో


అధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న రైతులు

కేటాయించిన రాజీవ్ గృహ కల్పకు ఇప్పుడు సంబంధం ఏంటని టిడిపి నాయకులు, వైసిపి నాయకులతో వాదనకు దిగారు. దీంతో సభ్యులు కొంత సేపు ఉద్రిక్తత తలెత్తింది. ఎస్ఐ వి.శ్రీనివాసరావు జోక్యం చేసుకుని వైసిపి నాయకులను బలవంతంగా బయటకు నెట్టేశారు. జెడ్పీ బంటు సన్యాసినాయుడు, వివిధ శాఖల అధికారులు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చిక్కాల విజయ్‌బాబు, డివిజన్ అధ్యక్షులు కొప్పల రమేష్, నాయకులు రవ్వ వెంకటరావు, కొప్పల కృష్ణారావు, చిలకా నర్సింగరావు, కోనూరు రాంబాబు, బడిగంట నీలకంఠం తదితరులు పాల్గొన్నారు. గ్రామీణంలోని, మండలంలోని నిడిగట్టు, కె నగరపాలెం గ్రామాల్లో జన్మభూమి - మావూరు గ్రామ సభలు జరిగాయి. ఎంపిపి యరబాల కృష్ణవేణి, జెడ్పీటిసి సరగడ అప్పారావు, ఆయా పంచాయితీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, టిడిపి మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నర్సింమరాజు పాల్గొన్నారు.

ఆనందపురం: చెరువు, శ్మశానానికి పాసు పుస్తకాలు ఎలా ఇస్తారని చందక గ్రామస్థులు బుధవారం జన్మభూమి సభలో అధికారులను నిలదీశారు. మండలంలోని చందక, వేములవలస, శిర్లపాలెం గ్రామంలో బుధవారం జన్మభూమి సభలు నిర్వహించారు. చందక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ అరుణశ్రీ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో చందక గ్రామస్థులైన శిరిపురపు రామారావు, రాము దొంతల అప్పలనాయుడు తదితర రైతులు గొట్టిపల్లి రెవిన్యూ పరిధిలోని సర్వేనంబర్ 102/3 లో సుమారు 9ఎకరాల 85 సెంట్లు భూమిలో చెరువు, శ్మశానంతో పాటు సాగుభూమి ఉందని ఎలాంటి పరిశీలన లేకుండా పాసుపుస్తకాలు మంజూరు చేసి భూకబ్జాదారులకు సహకరిస్తున్నారని నిలదీశారు. దీనిపై ఏడాది నుండి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన ఆర్‌డిఒ కోర్టులో ఉన్నాదంటూ తప్పించుకు తిరుగుతున్నారన్నారు. సమస్యలు పరిష్కారం కాని సభలు ఎందుకని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులు చేసిన అధికారులు బదిలీలపై వెళ్లిపోయి మమ్మల్ని మాత్రం కోర్టులు చుట్టూ తిరగండి అంటూ చిచ్చు పెట్టి పోతున్నారన్నారు. తమకు న్యాయం జరిగేటందుకు త్వరగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ పాండ్రంగి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఐ ప్రసన్న కుమార్, మాజీ ఎంపిటిసి బంక సత్యనారాయణ మాజీ సర్పంచ్ గుషిడి రమణ కోఆపరేటివ్ డైరెక్టర్ ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

వేములవలసలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ కెవి ఈశ్వరరావు ఆధ్వర్యంలో మండల ప్రత్యేకాధికారి రామరాజు సమక్షంలో గ్రామంలోని సమస్యలు తెలుసుకున్నారు. వేములవలసలో 2009లో కేటాయించిన ఇళ్లస్థలాలు పరిష్కారం చేయాలని గ్రామస్తులు అధికారులు దృష్టికి తీసుకు వచ్చారు. ఇప్పటికైనా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బి.మణిశంకర్ నాయుడు మాజీ ఎంపిపి కోరాడ రాజబాబు, ఎంపిపి చెన్నా వరలక్ష్మి, డిసిసిబి డైరెక్టర్ పాండ్రంగి బిఆర్‌బి నాయుడు తదితరులు పాల్గొన్నారు. శిర్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఐఆర్‌డి రమణయ్య ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ షిణగం అప్పలరాజు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో సుమారు 200 మంది రైతులకు ఇనాం భూములకు పాసు పుస్తకాలు మంజూరు చేయవలసి ఉందన్నారు. ఏళ్ల తరబడి దరఖాస్తులు చేసుకున్నా పరిష్కారం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వరలక్ష్మి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని పలు తునివలస, అయినాడ, వెంకటాపురం, గ్రామాలలోని బుధవారం జన్మభూమి కార్యక్రమంలో జెడ్పిటిసి దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాములో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రైతు రుణాలు మాఫీలు, మహిళాసంఘాలకు వడ్డీలేని రుణాలు చెల్లిస్తున్నామని వివరించారు. రేషన్‌కార్డులు, పింఛనలు, చంద్రన్న బీమాపథకం, చంద్రన్నబాట, వంటి అనేక రకాల పేదలకు మేలుచేసు కార్యక్రమాలను చేపట్టమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డి నాగేశ్వరావు, ఎంపిడిఒ సిహెచ్ నిర్మాలాదేవి, తాహశీల్దారు కె.రమాదేవి, పార్టీ మండల అధ్యక్షులు కాళ్ల నగేష్‌కుమార్, రూరల్ టిడిపి మహిళా అధ్యక్షులు కురిమిన లీలావతి, సర్పంచ్‌లు ఆర్ఎన్ మూర్తి, కర్రి రమణ, కోరాడ రామేశ్వరావు, రేవిడి ఎంపిటిసి, ఎ.గంగరాజు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

అంతర్ వర్సిటీ క్రీడలు ప్రారంభంలో గంటా


సభలో మాట్లాడుతున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస

భీమిలి మండలం రఘు ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 12వ తేదీ వరకు జరగనున్న సౌత్ జోన్ అంతర్ యూనివర్సిటీ క్రికెట్ (పురుషులు) టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడా పోటీలు ప్రారంభ సూచికగా శాంతి కపోతం, బెలూన్లు, క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి గంటా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, పెద్ద పీట వేస్తుందని అన్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని గచ్చి బౌలీ తరహాలో విశాఖ జిల్లా అగనంపూడిలో 150 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మించనున్నట్లు వివరించారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర ఆచార్య నాగేశ్వరరావు, రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ విజయ్ మోహన్, జెఎన్‌టియు (కె) ప్రొఫెసర్ కుమార్ పాల్గొన్నారు.

ఐదు రాష్ట్రాలనుంచి...

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కేరళ, కర్నాటక, రాష్ట్రాలకు చెందిన 98 మునిసిపాలిటీల నుంచి 1900 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు

సాగర్‌నగర్ బీచ్‌లో 'గోనేసంచి' చేప

సాగర్‌నగర్:జివిఎంసి ఆరోవార్డు పరిధి సాగర్‌నగర్ తీరాన బుధవారం ఉదయం గోనే సంచి చేప లభించింది. మత్స్యకారులు వేసిన వలలో చిక్కింది. ఇది చాలా అరుదుగా చిక్కుతుందని మత్స్యకారులు తెలిపారు. దీనిని తిలకించడానికి స్థానికులు ఆశక్తిగా వచ్చారు.

అమ్మాయిలు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలి

జిసిడిఒ, ఎపి సెల్ఫ్‌డిఫెన్స్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్

ప్రజాశక్తి-మధురవాడ

అమ్మాయిలు ఆత్మసైర్యం పెంపొందించు కోవాలని గర్ల్స్ చైల్డ్ డవలప్‌మెంట్ ఆఫీసర్ (జిసిడిఒ), రాష్ట్ర కౌమారదశ బాలికల ఆత్మరక్షణ శిక్షణ తరగతుల పరిశీలకులు పి.గీత పిలుపునిచ్చారు. బుధవారం విశాఖలోని పలు పాఠశాలలను సందర్శించి (ఆర్ఎంఎస్ఎ) రాష్ట్రీయ మాధ్యమిక శిక్షణ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆత్మరక్షణ శిక్షణ తరగలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండాడ, చంద్రంపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్‌తోపాటు ఆనందపురం కస్తూరిబాగాంధీ విద్యార్థినులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తలపెట్టిన 8, 9 తరగతుల విద్యార్థినులకు మార్షల్‌ఆర్ట్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైక్వాండో సంఘ కార్యదర్శి, పి.అచ్చుతరెడ్డి, సహమిక జిసిడిఒ ఎం. భారతి చంద్రంపాలెం ఉపాధ్యాయులు ఎం రాజబాబు, జయప్రద, భీమిలి నియోజకవర్గ సెల్ఫ్ డిఫెన్స్ కో-ఆర్డినేటర్ ఆనందరావు, పాల్గొన్నారు.


సంతాపసభలో నివాళ్లర్పిస్తున్న పైడిరాజు, నాయకులు

నారాయణ సంతాపసభ

ప్రజాశక్తి-తగరపువలస

నాగోతి నారాయణ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. సిపిఐ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘాలు చురుకైన పాత్ర వహించిన కీర్తి శేషులు నాగోతి నారాయణ సంస్మరణ సభ బుధవారం తగరపువలసలో నిర్వహించారు. సిపిఐ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ తుదకంటూ కమ్యూనిస్టుగా పనిచేసి, పేదకప్రజల హృదయాల్లో నారాయణ చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. సిపిఐ సీనియర్ నాయకులు తెడ్డాపు గున్నారావు, చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు పడాల రమణ, సిపిఎం భీమిలి మండల కన్వీనరు రవ్వ నర్సింగరావు, మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. సిపిఐ నాయకులు అల్లు బాబూరావు అధ్యక్షతన జరిగి ఈ సంస్మరణ సభలో టిడిపి తగరపువలస డివిజన్ అధ్యక్షులు కొప్పల రమేష్, వైసిపి మండల అధ్యక్షులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తొలుత నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

పశువైద్యశాల కలేనా ?

మధురవాడ:జివిఎంసి విశాఖ జోన్-1 పరిధి మధురవాడ జోనల్ ఆఫీస్ పక్కనున్న పశువుల ఆసుపత్రికి ప్రభుత్వ నిధులు పుష్కలంగా ఉన్నా నూతన భవనం నిర్మించడంలేదు బుధవారం డాక్టర్ శ్రీనుపాసరావు మాట్లాతూ సంవత్సరం క్రితం ఆసుపత్రికి నూతన భవనం నిర్మాణానికి 30 లక్షలు కేటాయించిందని 200 వందల గజాల స్థలం ఉండేదని మొత్తం స్థలంలో నిర్మాణం చేసేందుకు కేటాయింపులు జరిగాయాని కాని నిర్మాణానికి ఇంతవరకూ నోచుకోలేదని అన్నారు. ఆధునాతన వసతులతో నూతన భవనం వస్తుందని ఆశపడ్డా అది నెరవేరలేదన్నారు. తహశీల్దార్ ఆఫీస్ నుంచి సిబ్బంది వచ్చి సర్వే నిర్వహించి అందులో 40 గజాలు రోడ్డు విస్తరణకి మినహాయించారని తెలిపారు. మిగిలిన 160 గజాల్లో ఈ నిర్మాణంకి చాలదని వివరించారు. 160 గజాలలో 2 అంతస్తుల నిర్మాణం సాధ్యంకాదని పై అధికారులకు తెలిపామని అయినా ఎలాంటి స్పందనా లేదని అన్నారు. మధురవాడ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ పశువులకు మెరుగైన చికిత్స అందుతుందని ఎదురు చూస్తున్న వారికి నిరాసే మిగిలిందన్నారు. ఇప్పటికైనా అధికారులు నూతన భవనం నిర్మాణానికి పూనుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రవీంద్రభారతి విద్యార్థుల ఆర్థికసాయం

ఆనందపురం:మానవతా విలువలు చాటి చెప్పే విధంగా మండలంలోని వెల్లంకి వద్దగల రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు అనాథ ఆశ్రమానికి ఆర్థిక సాయం చేశారు. వారు సేవాభావంతో సమకూర్చిన రూ. 12 వేలు రూపాయలను భీమిలి అనాధాశ్రమానికి(ఎస్ఒఎస్) అందజేశారు. మేరకు పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి వెంకటేష్ నాయుడు, ఉత్తరాంధ్ర జోనల్ డీన్ వసంత, ఎజిఎం రమేష్‌నాయుడు, ప్రిన్సిపల్ ధనుంజయరావు పాల్గొన్నారు.

గొప్ప హేతువాది సుబ్బారావు

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింగరావు

ప్రజాశక్తి- మద్దిలపాలెం

కుటుంబ సభ్యులందరికీ కులాంతర వివాహాలు జరిపిన గొప్ప హేతువాది సుబ్బారావు అని, ఈయన్ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. నగరంలోని శివాజీపాలెంలో బుధవారం సిపిఎం అధ్వర్యాన కుంచం సుబ్బారావు సంస్మరణ సభ జరిగింది. ముందుగా సుబ్బారావు చిత్రపటానికి సిపిఎం, సిఐటియు నాయకులు, యూనివర్సిటీ ఉద్యోగులు, కుటుంబసభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారావుపై ప్రజానాట్య మండలి సభ్యులు చంటి రాసిన గేయాన్ని చిన్నారి, కుమారి ఆలపించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.మణి అధ్యక్షతన జరిగిన సభలో నర్సింగరావు మాట్లాడుతూ, నమ్ముకున్న సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడిన నిబద్ధతగల వ్యక్తిని కొనియాడారు. తన కుటుంబాన్నతంటినీ పార్టీకే అంకితం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఏ పదవులు నిర్వహించనప్పటికీ పార్టీలో కీలకంగా పనిచేశారని, ఆయన జీవితంలోని అన్ని కోణాలూ ఆదర్శమేనని అన్నారు. సోషలిజంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని గట్టిగా విశ్వసించిన వ్యక్తి అని పేర్కొన్నారు.



దేహదానం చేస్తూ పత్రాలు అందజేస్తున్న సుబ్బారావు కుటుంబ సభ్యులు

సిపిఎం నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీలో పని చేస్తూ ఉద్యోగ సంఘాలు, సిఐటియు ఉద్యమాలు, ప్రజానాట్య మండలి, పార్టీ కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ అంకిత భావంతో పనిచేసిన గొప్పవ్యక్తని కొనియాడారు. యూనివర్సిటీ హాస్టల్‌లో ఉదారంగా పనిచేసి విద్యార్థుల మన్ననలందుకున్నారన్నారు. కుటుంబాన్నంతటినీ పార్టీ చేతుల్లో పెట్టి ఆదర్శవంతుడుగా మిగిలారని, జ్యోతిబసు దేహదాన ట్రస్టుకు శరీరాన్ని దానం చేసిన తొలి వ్యక్తి అని పేర్కొన్నారు.

పెట్రోలియం యూనివర్సిటీ డైరెక్టర్ ఆచార్య వివిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ, సుబ్బారావుతో తనకు 30 ఏళ్ళ నుంచి పరిచయముందని, తన భావాలను సున్నితంగా చెప్పేవారని పేర్కొన్నారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు పద్మనాభరాజు మాట్లాడుతూ, ఆయన మన మధ్యలో లేకపోయినా మన మదిలోనే ఎల్లప్పుడూ ఉంటారని అన్నారు. ఎప్పుడు, ఎక్కడ పార్టీ కార్యక్రమాలు, ఉద్యమాలు జరిగినా పాలుపంచుకునే వారని పేర్కొన్నారు.

ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ మేనేజర్ ఎస్.సుధాకర్ మాట్లాడుతూ ఎయు యూనియన్ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేసేవారని తెలిపారు. ఎటువంటి పదవులూ ఆశించకుండా చివరివరకూ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. అనంతరం సుబ్బారావు సహచరులు పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, ఆర్ఎస్ఆర్. దేవుడు, రఘునాధ పాత్రో తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాధం, పార్టీ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు. సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కృష్ణారావు వందన సమర్పణ చేశారు.



సభలో మాట్లాడుతున్న నర్సింగరావు, వేదికపై గంగారావు, సుధాకర్, పద్మనాభరాజు, జగ్గునాయుడు, కుమార్ తదితరులు

మేము సైతం..

సుబ్బారావు సతీమణి రమణమ్మ, పెద్ద కుమార్తె సుజాత, పెద్దల్లుడు శంకరరావు తన శరీరాలను పరిశోధనలకు ఉపకరించేవిధంగా మరణానంతరం దానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు దరఖాస్తు పూర్తి చేసి నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మరణానంతరం దేహాన్ని కాల్చితే బూడిదే మిగులుతుందని, దానం చేయడం వల్ల పరిశోధనలకు ఉపయోగపడుతుందని తెలిపారు.

అట్టహాసంగా మేజర్ పోర్టు క్రీడలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

స్థానిక పోర్టు స్టేడియంలో బుధవారం ఆలిండియా మేజర్ పోర్టు క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ 2018 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఐఆర్‌టిఎస్ డిప్యూటీ ఛైర్మన్ పిఎల్ హరినాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఉత్తేజాన్ని కూడా కలిగిస్తాయన్నారు. కొన్ని క్రీడలు



శారీరకంగా ఆడాల్సి ఉన్నప్పటికీ క్యారమ్స్, చెస్ మైండ్‌తో ఆడాల్సి ఉంటుందన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. తొలి రోజు విశాఖపట్నం, ఇన్నోర్, చెన్నై, ముంబయి, కండ్లా, ఎన్ఎంపిటి, కోల్‌కత్తా ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు తలబడ్డారు. ఈ కార్యక్రమంలో విశాఖ పోర్టు ట్రస్టు కార్యదర్శి సి.హరిచంద్రన్, మేజర్ పోర్టు స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు చీఫ్ ఇంజినీర్ ఎకె.మెహర, ఒలింపియన్ మాణిక్యాలు తదితరులు పాల్గొన్నారు.





చెస్, టేబుల్ టెన్నిస్ ఆడుతున్న పోర్టు క్రీడాకారులు

ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం..

ప్రజాశక్తితో సురభి నాటకాల డైరెక్టర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి -మునగపాక

సురభి 132 సంవత్సరాల చరిత్రలో ఇంచుమించుగా 1991 వరకు చాలా కష్టాలు ఎదుర్కొన్నామని సురభి నాటకాల డైరెక్టర్ ఆర్.నాగేశ్వరరావు (బాబ్జి) చెప్పారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకల్లో భాగంగా మునగపాక మండల కేంద్రంలో రెండురోజులుగా సురభి నాటకాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన్ని కలిసిన ప్రజాశక్తితో సురభి నాటకాల విశేషాలపై ముచ్చటించారు. ఒకే కుటుంబానికి చెందిన 70 సమాజాలున్నాయి. ఒక్కొక్క సమాజానికి 60 నుండి 70 మంది తక్కువ లేకుండా నిర్వహించుకుంటూ వచ్చాం. కాలక్రమేణా సురభి నాటకాలకు ఎంతో ఆదరణ పెరిగింది. కానీ ఆదాయం కన్న ఖర్చులు ఎక్కువ కావడంతో చాలా సమాజాలు అప్పులపాలయ్యాయి. సమాజాలు నడపడం మానేసినప్పటికీ మనోధైర్యంతో ఈ సమస్యల నుంచి గట్టెక్కెందుకు.. రాబోయే రోజుల్లో మంచి రోజులు వస్తాయనే ఆశతో కేవలం ఐదు సమాజాలు వారసత్వంగా భావించి నిర్వహిస్తున్నారు. ఈ సురభి సమాజానికి అన్ని విధాలుగా ఆర్థికంగా మాకెంతో ప్రోత్సాహం ఇస్తూ మా సురభి సమాజానికి ఒక రూపకల్పన తెచ్చారు డాక్టర్ కెవి రమణాచారి (రిటైర్డ్ ఐఎఎస్ అధికారి). 1996లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా న్యూఢిల్లీ, స్పందన బెంగుళూర్ ఈ రెండు సంస్థల నుండి నేషనల్ స్థాయిలో భీష్మ అను నాటకానికి వర్క్ షాప్ కాంట్రాక్ట్ చేశారు. ఈ కాంట్రాక్టర్‌కు పద్మశ్రీ బివి కారంత్ నేషనల్ డైరెక్టర్ వీరు సంగీత దర్శకత్వంలో ఈ నాటకం తయారు చేయబడింది. 1997లో చండీ ప్రియ అను జానపద నాటకం, 1998లో బషీదేవతి యాదమ్మ అను సాంఘిక నాటకాన్ని వారి శిక్షణలో నేర్చుకొని ఈ మూడు నాటకాలు కూడా భారత దేశంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించడం జరిగింది.



అందువల్ల కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి సురభి సమాజాలకు నెలనెల జీతాలు ఇవ్వడానికి ముందుకొచ్చింది. అప్పటి నుండి సురభి సమాజాలు నిలబడడానికి ఆస్కారం ఏర్పడింది. మునగపాక గ్రామానికి మూడు సమాజాల వారు (65 మంది) వచ్చారు. 13 సంవత్సరాలుగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్ తెలుగు లలిత కళాతోరణి ప్రాంగణంలో సురభి థియేటర్ నిర్మించుకుని ప్రదర్శిస్తున్నామని తెలిపారు.

ఆకట్టుకున్న పాతాళభైరవి నాటకం

మునగపాక : మండల కేంద్రమైన మునగపాకలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకల్లో భాగంగా రెండవ రోజు సురభి నాటకాలు కొనసాగాయి. బుధవారం పాతాళభైరవి నాటకం జనాలను ఎంతో ఆకట్టుకుంది. నాటకం ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేసింది. సుమారుగా నాటకాన్ని తిలకించేందకు చుట్టు పక్కల గ్రామాల నుండి 5వేల మంది వచ్చారు.